
మహానీయుల బాట
1

HAMARE BUZURG-PART-I
(Telugu)

# మహనీయుల బాట

## (మొదటి భాగం)


మూలం
మాయల్ ఖైరాబాదీ

అనువాదం
సయ్యద్ హుసైన్



**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్** (Regd.)
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్
హైదరాబాద్-500 002.

**Mahaneeyula Bata**

**Hamare Buzurg - Part-I** (Telugu)

**T.I.P. Series No. 66**


Writer : MAYAL KHAIRABADI

Translated by : SYED HUSSAIN


All Rights Reserved with Publishers


3rd Edition : February 2017

Copies : 1000

Price : **Rs. 35**

ISBN : 81 - 86826 - 69 - 6

Published by **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Phones: 040-24564583, 24576237
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad - 2

Printed at : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# నా మాట

ఇన్నా అక్‌రమకుమ్ ఇన్దల్లాహి అత్ ఖాకుమ్ (ఎవరయితే మీలో అల్లాహ్ పట్ల అధికంగా భయభక్తులు కలిగివుంటాడో, అతడే దేవుని వద్ద అత్యంత ఆదరణీయుడు, శ్రేష్ఠుడూను).

సాధారణంగా మనం సిరిసంపదలు కలవాళ్ళనో, కులీన వంశానికి చెందినవాళ్ళనో, విద్యావంతులనో లేక అధికారం కలవాళ్ళనో, గొప్పవాళ్ళుగా, గౌరవనీయులుగా భావిస్తాము. అయితే ఇస్లామ్‌లో ఎవరయితే దైవం పట్ల అత్యధిక భయభక్తులు కలిగివుండి, ఎల్లప్పుడూ అంతిమదినాన జరిగే కర్మల విచారణ పట్ల భయపడుతూ ఉంటాడో, అతడే అందరిలోకెల్లా గొప్పవాడు, ఆదరణీయుడు. వాస్తవానికి అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఉండే భయభక్తులే మనిషిని ఉత్తమునిగా తయారుచేస్తాయి. తత్ఫలితంగా మనిషి చెడులకు దూరంగా మసలుకోగలుగుతాడు. మనిషి చెడులకు ఎంత దూరంగా మసలుకుంటాడో అంతే మంచికి చేరువవుతూ మంచి మనిషిగా రూపొందగలడు.

ఇలాంటి దైవభీతి కలవారినే మనం మంచి మనుషులుగా, ఆదరణీయులుగా, అధికులుగా పరిగణిస్తాం. ఇలాంటివారి చరిత్ర, ఆచరణలే మనకు అత్యున్నత మానవీయ ఆదర్శాలవుతాయి. అలాంటివారి అడుగు జాడల్లో నడుచుకోవడంలోనే మన శ్రేయస్సు ఇమిడివుందని భావిస్తాం మనం. అందువల్లనే మనం ఇలాంటి శ్రేష్ఠ మానవుల కోసం గాలించి, వారి సమస్త విషయాలను భద్రపరుస్తాం. దీనివల్ల మన తరువాత భావిలో ఉనికిలోకి వచ్చే మానవ సంతతి అలాంటి ఆదరణీయులయిన పెద్దల జీవిత విశేషాలు చదివి గుణపాఠం నేర్చుకునే అవకాశం ఉంటుంది.

ఇలాంటి ఆదరణీయుల్లో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు అతి చేరువగా ఉండి, ఆయన ఇచ్చిన సుశిక్షణను అలవర్చుకున్న మహనీయులు మొదటి కోవకు చెందినవారు. వీరినే మనం సహాబా (ప్రవక్త అనుయాయులు) (రజి) అని అంటాం. వీరి తరువాత వారి శుశ్రూష భాగ్యం లభించినవారు, ఆ తరువాత వారి శిష్యులు - ఇలా వరుసక్రమంలో తమ పెద్దల వద్ద ప్రయోజనం పొందినవారు ఆదర్శనీయులు.

ఇలాంటి మహనీయుల జీవిత విషయాల్ని సులభగ్రాహ్యమయిన భాషలో దైవదాసులకు పరిచయం చెయ్యడానికి, ముఖ్యంగా తక్కువ విద్యనభ్యసించిన వారు, ఇప్పుడిప్పుడే పైకి ఎదిగివస్తున్న నవతరం సయితం ప్రయోజనం పొందడానికి ప్రయత్నించాము.

ఈ సందర్భంలో మా తొలి ప్రయత్నంగా కొంత మంది మహనీయుల విషయాల్ని ఈ పుస్తకంలో పొందుపరుస్తున్నాం. దీని తరువాత దైవానుగ్రహం ఉంటే ఇతర ఆదరణీయులయిన పెద్దల సచ్చరితల్ని కూడా ముద్రించి మీకందించే ప్రయత్నాన్ని కొనసాగిస్తాం.

మా ఈ తొలి ప్రయత్నం ప్రత్యేకత ఏమిటంటే- కథల రూపంలో చదువుకోవడానికి అనువుగా మహనీయుల చరితల్లోని కొన్ని సంఘటనల్ని ఎన్నుకున్నాం. దైవానుగ్రహం వలన మీ ముందున్న ఈ కృతిలోని విషయాల్ని అత్యంత సులభ శైలిలో కూర్పు చేయడం జరిగింది. ఎవరయితే ఈ విషయాల్ని చదివి తెలుసుకుంటారో వారి హృదయాలు మంచి వైపునకు మొగ్గాలని దైవాన్ని వేడుకుంటున్నాము. ఆమీన్!

- మాయల్ ఖైరాబాది

# హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై)

మన ఆదరణీయులయిన పెద్దలలో హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) అనే ఓ ఆలిమ్ (పండితుడు) ఉండేవారు. ఆయన మదీనా నివాసి. ఆ కాలంలో ఆయనే అందరికంటే గొప్ప ధర్మవేత్తగా పరిగణింపబడేవారు. ఆయన కేవలం ధర్మవేత్తేగాక మంచి నడవడి కూడా కలవారు. అంటే ఖుర్ఆన్, హదీసుల ద్వారా తను ఆర్జించిన జ్ఞానం ప్రకారం ఆచరించే వారు. ఖుర్ఆన్, హదీసులకు వ్యతిరేకంగా ఏ పొరపాటూ జరగకుండా అనుక్షణం జాగ్రత్తపడేవారు. ఆయన ప్రవక్త (సఅసం) ప్రియ సహచరులు (రజి) కొందరు జీవించి ఉన్న కాలంలో జన్మించారు. ఈ పెద్దల ద్వారానే హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ ఖుర్ఆన్, హదీసుల జ్ఞానాన్ని ఆర్జించారు. ఈయన దైవప్రవక్త (సఅసం) అనుయాయుల (రజి)కు అనుంగు శిష్యులు. సహాబీల (రజి) ద్వారా తను పొందిన ధార్మిక జ్ఞానాన్ని ఆయన బాగా గుర్తుంచుకుని దాని ప్రకారం ఆచరించే వారు. ఈ విధంగా ఆయన ఎంతో సత్యవంతుడయిన ముస్లిమ్ అయ్యారు. ఆయన జ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందేదో అంతగానే ఆయన ప్రవర్తనలో కూడా పురోగమనముండేది. ఉన్నత పాండిత్యం, ప్రవర్తనల కారణంగానే ఆయన్ని సహాబీలు (రజి) కూడా ఎంతో ప్రేమించేవారు. ఈ కారణంగానే ప్రవక్త ప్రియ సహచరులు హజ్రత్ అబూ హురైరా(రజి) ఆయనకు తన కుమార్తెనిచ్చి వివాహం జరిపించారు. పుస్తకాల్లో వీరికున్న అనేక సద్గుణాల్ని గురించి వ్రాయడం జరిగింది. వీటన్నిటినీ మనం సమీకరించినట్లయితే ఓ పెద్ద గ్రంథమే తయారవుతుంది. అయితే ఈ సందర్భంగా మేము ఓ విషయాన్ని ప్రస్తావిస్తున్నాం. ఆయన జీవితంలో మనకు ఉపయోగపడే ఏ ఏ విషయాలున్నాయో మీరూ దీన్ని చదివి ఆలోచించండి-

దేవుడు హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై)కు ఓ సద్గుణవతి అయిన కూతురును ప్రసాదించాడు. ఈమె ఎంతో తెలివయిన అమ్మాయి. హజ్రత్ సయీద్ (రహ్మలై) ఆమెకు విద్య నేర్పడం మొదలెట్టారు. కొద్ది రోజుల్లోనే ఆమె ఖుర్ఆన్, హదీసుల జ్ఞానాన్ని నేర్చుకున్నారు. ఆ జ్ఞానాన్ని తన శక్తివంచన లేకుండా పూర్తిగా ఆచరణలో కూడా పెట్టడం మొదలెట్టారు. అనతి కాలంలోనే ఈమె ఎంతో జ్ఞానవతిగానే గాక, మంచి నడవడిక గల మహిళగా వినుతికెక్కారు. ఉన్నత వంశంతో పాటు ఆమె ఎంతో రూపవతి కూడా. ఈమె ఏ వంశానికి చెందిన వారో మీరు గ్రహించారా? హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) ఖురైష్ వంశానికి చెందినవారు. ఈ ఖురైష్ వంశం అరబ్ దేశంలో అత్యంత గౌరవనీయ వంశంగా ఎంచబడేది. అలాంటి గొప్ప గౌరవనీయ వంశంలో ఈమె జన్మించారు. ఈ విధంగా ఆమె నాలుగు గొప్ప లక్షణాలు కలిగి ఉన్నారు. అవి : (1) ఆమె ఉన్నత వంశానికి చెందినవారు, (2) ఆమె ఎంతో అందమయినవారు, (3) ఆమె గొప్ప జ్ఞానవతి, (4) ఆమె ఎల్లప్పుడూ ధర్మజ్ఞానంపై నడుచుకునే గొప్ప శీలవతి.

తరువాత ఇంక వినండి. ఈమె సద్గుణాల సత్కీర్తి ఖలీఫా అబ్దుల్ మలిక్ కూడా విన్నాడు. ఖలీఫా అబ్దుల్ మలిక్ అప్పట్లో ఓ గొప్ప చక్రవర్తి. ఆయన ఈమెను తన కోడలిగా చేసుకోదలచి, ఓ పెద్ద మనిషిని హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) వద్దకు పంపాడు. అయితే సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) తన కూతుర్ని రాకుమారునికివ్వడానికి నిరాకరించారు. అవును! తన కుమార్తె వివాహం రాకుమారునితో జరిపించడానికి నిరాకరించారు. ఇది విన్న ప్రతి మనిషీ ఆశ్చర్యచకితుడయ్యాడు.

మీరే ఆలోచించండి. రాజుగారి అంతఃపురంలో తన కూతురు ఎంత సుఖంగా ఉంటుందో. అక్కడయితే కోరిన సౌఖ్యాలు లభిస్తాయి. ఎల్లవేళలా పరిచారికలు, దాసదాసీలు తన కూతురికి సేవ చేయడానికి సిద్ధంగా ఉంటారు.

తన కుమార్తె ధనసంపదలతో, భోగభాగ్యాలతో తులతూగవచ్చు, ఏమి కావాలంటే అది క్షణాల్లో తినవచ్చు, ఎటువంటి వస్త్రాలు, నగలు కావాలన్నా తొడగవచ్చు, తను దేన్ని కోరితే దాన్ని చేయవచ్చు. చక్రవర్తుల, రాజుల, రాకుమారుల జీవితాలు ఇలాగే సాగుతాయి.

ఇన్ని సౌకర్యాలు, సౌఖ్యాలున్నా కేవలం ఒక్క విషయం కొరత వల్లనే సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) ఈ సంబంధాన్ని నిరాకరించారు. అదేమిటంటే, ఆయన ఖలీఫా అబ్దుల్ మలిక్‌ను సత్యవంతుడయిన ఖలీఫాగా పరిగణించేవారు కాదు, పైగా ఆయన్ని క్రూర చక్రవర్తిగా భావించేవారు. అటువంటి ఖలీఫా వద్ద ఉన్న పెద్ద పెద్ద సర్దారు (నాయకు)లు కూడా అలాంటివారే అయివుంటారు. ఆయన సర్దారుల్లో హజ్జాజ్ బిన్ యూసుఫ్ అందరికన్నా పెద్ద నాయకుడు. ఇతను అత్యంత క్రూరుడు, ఈ దుర్మార్గుడంటేనే అబ్దుల్ మలిక్‌కు ఎక్కువ ఇష్టం. ఈ కారణంగానే సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) తన కూతుర్నివ్వడానికి నిరాకరించారు. దీనిపై అబ్దుల్ మలిక్ ఆయన్ని ఎంతో వత్తిడి చేశాడు, వేధించాడు కూడా. అయితే, "వివాహ విషంయలో సాధారణంగా ప్రజలు వంశాన్ని, ఐశ్వర్యాన్ని, విద్యార్హతలను, అందచందాలను మాత్రమే చూసి వివాహాలు చేస్తారు. కాని ధార్మికతను చూసి వివాహం చేయాలి" అని ప్రియప్రవక్త (సఅసం) ప్రవచించారు. ఈ ప్రవచనం హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) దృష్టిలో మెదలుతూ ఉంది. ధార్మికత లేనివారే దుర్మార్గులవుతారన్నది అందరికీ తెలిసిందే. మరి అటువంటప్పుడు సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) అబ్దుల్ మలిక్‌తో బంధుత్వాన్ని ఎలా ఖాయపరచుకుంటారు? ఏమైనా చివరికి ఈ ప్రాపంచిక సుఖాలన్నీ అంతమయ్యేవే కదా అని ఆయన (రహ్మలై) భావించేవారు. వాస్తవం కూడా ఇదే కదా! పరలోక సౌఖ్యమే అసలైన సౌఖ్యం.

నిజమయిన ముస్లిమ్ మంచి పనులు చేస్తూ ధర్మంపై నడుచుకుంటూ

దైవప్రసన్నతకై కృషి చేస్తూ ఉంటాడు. అవే అతనికి సంతోషాన్ని కలిగించేవి. హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) ఇలాంటి వ్యక్తి కాబట్టే అలాంటి వారంటేనే ఇష్టపడతారు. తన కుమార్తె కూడా అలాంటి సద్గుణరాశే.

తన కుమారునితో సయీద్ తన కూతురి వివాహం జరిపించడానికి నిరాకరించటం వలన అబ్దుల్ మలిక్ ఆయన్ని మరింతగా వేధించడం ప్రారంభించాడు. దీనిపై హజ్రత్ సయీద్ (రహ్మలై) ఎక్కడయినా సరే తన కూతురి వివాహం త్వరగా జరిపించాలని ఆలోచించారు. ఆయన తన కుమార్తె కొరకు ఎటువంటి వరుణ్ణి ఎన్నుకున్నారో కాస్త మీరే గమనించండి. తన శిష్యుల్లోనే ఓ మంచి విద్యార్థి ఉన్నాడు. ఆయన పేరు 'వదాఅ.' ఒకసారి ఏమయిందంటే, 'వదాఅ' వరుసగా ఎన్నో రోజులు గైరుహాజరై మళ్ళీ తన వద్దకు వచ్చారు. అలా వచ్చిన అతనితో, "ఇన్నాళ్ళు ఎక్కడున్నారు" అని సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) అడిగారు. అందుకు సమాధానంగా వదాఅ, "తన సతీమణి మరణించడం వలన రాలేకపోయాన"ని అన్నారు.

"అయితే ఈ విషయం నీవు నాకెందుకు తెలియజేయలేదు. నేను కూడా ఖననసంస్కారంలో పాల్గొనేవాణ్ణిగదా" అని అన్నారు సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై). ఇది విని వదాఅ మౌనంగా ఉండిపొయ్యారు. లేచి నిల్చుని వెళ్ళడానికి సిద్ధమయిన వదాఅతో, "మరి నీవు ఎక్కడయినా పునర్వివాహం చేసుకోవడానికి ఏమయినా ఆలోచించావా లేదా?" అని సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) మళ్ళీ అడిగారు.

"అయ్యా! నేనా పేదవాణ్ణి... నాకెవరు పిల్లనిస్తారు" అని వదాఅ చెప్పడం మొదలెట్టారు. సయీద్ బిన్ ముసయ్యిబ్ వెంటనే, "నేనిస్తాన"ని బదులిచ్చారు. అంతేకాదు, అక్కడికక్కడే ఉన్నపళంగానే, అబ్దుల్ మలిక్ తన కుమారునికై అడిగిన తన కూతుర్ని 'వదాఅ'కిచ్చి వివాహం జరిపించారు. ఈ

సందర్భంగా ఆయన (రహ్మాలై), "నీవు ఏ వంశానికి చెందిన వాడవని, నీ వద్ద ఎంత సంపద ఉందనీ" వదాఆను అడగలేదు. ఇంకా వదాఆ రంగు, రూపం ఎలా ఉందని కూడా ఆలోచించలేదు. వదాఆ ధార్మికంగా మంచి నడవడిక గలవాడని మాత్రమే ఆయనకు తెలుసు.

నికాహ్ అయిన తర్వాత వదాఆ ఇంటికి వెళ్ళిపోయారు. తన సతీమణి ఇంటికి వచ్చేంత వరకు ఎవరికీ ఈ విషయం చెప్పదలచుకోలేదో ఏమో! మొత్తానికి తను మళ్ళీ పెళ్ళి చేసుకున్న విషయం ఎవ్వరికీ తెలుపలేదు. ఇంకో వింతేమిటంటే, వదాఆ ఏ బట్టలయితే ధరించి పాఠశాలకు వెళ్ళారో వాటితోనే తన వివాహం జరిగిపోయింది. అటు వధువుకు కూడా కొత్త బట్టలు లేవు. ఈ విషయం ఎవరికయినా చెబితే నమ్మరు, పైగా వేళాకోళం చేస్తారు.

సరే, అప్పుడే ఏమయింది, ఇంకా చదవండి. మగరిబ్ వేళ అయింది, నమాజ్ తరువాత హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మాలై) కుమార్తెను వెంటబెట్టుకుని అల్లుని ఇంటికి బయలుదేరారు. అక్కడ వదాఆ పరిస్థితి ఎలా ఉంది? ఆయన ఆ రోజు ఉపవాసంతో ఉన్నారు. మగరిబ్ నమాజ్ తరువాత భోజనం చెయ్యడానికి కూర్చోబోయే సమయంలో ఎవరో తలుపు తట్టిన శబ్దం విన్పించింది. "ఎవరూ" అని అడిగారు వదాఆ. "సయీద్" అని సమాధానం వచ్చింది. సమాధానమైతే విన్పించిందిగాని, ఆయన హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మాలై) అని వదాఆ భావించలేదు. ఎందుకంటే హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మాలై) మస్జిద్‌కు వెళ్ళడానికి తప్ప మరి దేనికీ బయటికెళ్ళేవారు కారు, అందువలన ఆ తలుపు తట్టిన వ్యక్తి ఆయనేనని వదాఆ ఎలా ఊహించగలరు? ఆయన అనుకున్నారు- సయీద్ పేరుగల వ్యక్తి ఇంకెవరయినా కావచ్చని.

ఆయన వెళ్ళి తలుపు తెరిచి అస్సలాము అలైకుమ్ అని ఆశ్చర్య పోయారు. "అరే! మీరా? ఎందుకింత శ్రమ తీసుకున్నారు? ఆజ్ఞాపిస్తే నేనే

వచ్చేవాణ్ణి కదా? సరే, మంచిది, రండి, ఏమిటో ఆ ఆజ్ఞ''అని అన్నారు వదాఅ. "నీకు భార్య ఉన్నప్పుడు ఆమె నీతోపాటే నీ ఇంట్లో ఉండాలి కదా! అందుకే నేను ఆమెను తీసుకువచ్చాను. ఇదిగో నీ భార్య, తీసుకో'' అన్నారు సయీద్ (రహ్మాలై).

పెళ్ళి రోజునాటి పాత బట్టలతోనే ఉన్న నవ వధువు తండ్రి వెనకాల నిల్చుని ఉంది. నగానట్రా ఏమీ లేవు, పల్లకీ లేదు, తండ్రి వెంట కాలి నడకనే భర్త ఇంటికి వచ్చింది. హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మాలై) తన ముద్దుల కుమార్తెను ఆమె భర్త ఇంటిలో దిగబెట్టి, అక్కణ్నుంచే "అస్సలాము అలైకుమ్'' అని పలికి వాపసు వెళ్ళిపోయారు.

వదాఅ సంతోషం ఇంతా అంతా కాదు, ఇక ఇప్పుడు ప్రజలకు ఈ విషయం చెప్పక తప్పింది కాదు. ఆ సమయంలో ఆయన తల్లి ఏదో పనిమీద పక్కింటికి వెళ్ళారు. తర్వాత ఈ విషయం విని దౌడు తీసుకుంటూ వచ్చారు. కోడల్ని చూసి ఎంతో సంతోషించారు. "ఈమె హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మాలై) కుమార్తె. ఖుర్ఆన్ స్మర్త (కంఠస్థం చేసినవారు), హదీసు పారంగతురాలు, దైవం, దైవప్రవక్త (సఅసం) తెలియజేసినట్లుగా సద్వర్తనురాలయిన సతీమణికి ఉండవలసిన లక్షణాలేమిటో ఈమెకు బాగా తెలుసు'' అని వదాఅ అన్నారు.

చూశారు కదా మీరు సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మాలై) ఎటువంటివారో! ఇక ఇప్పుడు మీరే ఆలోచించండి- నేటి ముస్లిమ్‌లు తమ కుమార్తెల లేక కుమారుల వివాహ సందర్భాల్లో ఈ విధంగా ఆలోచిస్తున్నారా? వాస్తవమేమంటే, నేటి ముస్లిమ్‌లు తమ ధర్మం నుండి ఇంకా తమ గౌరవనీయులయిన పెద్దల మార్గం నుండి క్రమంగా దూరమయిపోతున్నారు. ఈ రోజుల్లో ప్రజలు వివాహమంటూ జరిగితే ధార్మికత లేకున్నా సరే, ఉన్నత వంశంవారితోనో, అధర్మ పద్ధతుల ద్వారా సంపాదించినా సరే ఐశ్వర్యవంతుల

తోనో, నూరుపాళ్ళూ షైతానీ లక్షణాలు కలవారయినా సరే అందచందాలు గలవారితోనో జరగాలని కోరుకుంటున్నారు. ఇలాంటి వివాహాల్లో డబ్బు కూడా మంచి నీళ్ళలా ఖర్చుచేయటం జరుగుతోంది. లెక్కకు మించిన ఎన్నో రకాల సంప్రదాయాలు పాటించబడుతున్నాయి. ఇలాంటివారు వివాహమయిన కొద్ది రోజుల్లోనే, అయ్యో! ఉన్న డబ్బుకాక అప్పులు కూడా అయ్యాయే ఈ పెళ్ళికి, ఇక ఇప్పుడు చేసేదేమిటి అని దిగులుతో తల పట్టుకుని కూర్చుండిపోతుంటారు. దైవాదేశాల, దైవప్రవక్త (సఅసం) ప్రవచనాల ప్రకారం నడవనివారు ఎన్నటికీ ధార్మికులు కాలేరు. దీనివల్లనే కదా అలాంటివారికి ఈ దుస్థితి ఏర్పడేది.

దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు: "అతి తక్కువ ఖర్చుతో జరిగిన వివాహమే అన్ని వివాహాల్లో కెల్లా ఉత్తమమైంది."

ఈ హదీసు ప్రకారం హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) తన కుమార్తె వివాహం ఎలా చేశారో మనకు అర్థమవుతుంది - దైవం ఆయనపై, ఆయన్ని అనుసరించినవారిపై తన కరుణానుగ్రహాల్ని కురిపించుగాక!

# హజ్రత్ ఇబ్రాహీం బిన్ యజీద్ తైమి (రహ్మలై)

ఒకానొకప్పుడు ఇబ్రాహీమ్ అనే ఒకే పేరుగల ఇద్దరు విద్వాంసులుండేవారు. ఇద్దరి తండ్రుల పేర్లు కూడా ఒక్కటే. అదే యజీద్, ఇబ్రాహీమ్ అనే ఈ ఇద్దరు పెద్దలు ప్రియప్రవక్త (సఅసం) అనుంగు అనుచరుల (రజి)కు శిష్యులు. అంటే ఇద్దరూ సమకాలీనులే. వీరు ప్రవక్త అనుచరుల వద్ద ధర్మజ్ఞానాన్ని అభ్యసించారు. అభ్యసించినదాని ప్రకారం ఆచరణ కూడా చేసేవారు. అంటే ఖుర్ఆన్, హదీసుల్లో ఇవ్వబడ్డ ఆజ్ఞల ప్రకారం నడచుకునేవారు. ఇద్దరి వంశాలు వేరైనప్పటికీ చాలా విషయాల్లో వీరిద్దరికీ పోలికలుండేవి.

ఒకరు ఇబ్రాహీమ్ బిన్ యజీద్ తైమీగా పిలువబడితే, మరొకరు ఇబ్రాహీమ్ బిన్ యజీద్ నఖయీగా పిలువబడేవారు.

వీరిరువురూ మన గౌరవనీయులయిన పెద్దల్లోనివారే. వీరి కాలంలోనే ఓ గొప్ప నాయకుడుండేవాడు. అతని పేరు హజ్జాజ్. ఇతనెంతో దుర్మార్గుడు, దౌర్జన్యపరుడు. ప్రియప్రవక్త (సఅసం) అనుయాయుల నెందరినో ఇతను తన పొట్టనబెట్టుకున్నాడు. అంతేగాక ఇంకెందరో గొప్ప గొప్ప ధర్మవేత్తలను కూడా హతమార్పింపజేశాడు ఈ దుర్మార్గుడు. అందువల్లనే ప్రవక్త అనుయాయులను, ధర్మపరాయణులైన ఇతర పెద్దలను అభిమానించే వారందరూ ఇతన్ని దుర్మార్గునిగానే పరిగణించేవారు. ఇలా ఇతన్ని దుర్మార్గుడు, క్రూరుడు అని అనేవారిలో ఇబ్రాహీమ్ బిన్ యజీద్ నఖయీ (రహ్మాలై) కూడా ఒకరు. అందువల్ల హజ్జాజ్ ఈయనకు ప్రాణ శత్రువుగా తయారయ్యాడు. ఓ రోజు ఇతను తన సిపాయీలను ఇబ్రాహీమ్ బిన్ యజీద్ నఖయీ (రహ్మాలై)ని బంధించుకు రమ్మని ఆజ్ఞాపించాడు.

ఈ విషయం ఆ కాలంలోనే ఓ ప్రఖ్యాత పండితులయిన హజ్రత్ ఇబ్రాహీమ్ బిన్ యజీద్ తైమీ (రహ్మాలై)కు తెలిసింది. ఎలాగయినా సరే హజ్రత్ ఇబ్రాహీమ్ బిన్ యజీద్ నఖయీ (రహ్మాలై) ప్రాణాల్ని కాపాడాలని అనుకున్నారు ఆయన. ఇలా ఆలోచిస్తూ ఎక్కడికో వెళుతున్న సమయంలో ఆయనకు ఇబ్రాహీమ్ బిన్ యజీద్ నఖయీ (రహ్మాలై) కొరకు గాలిస్తున్న హజ్జాజ్ సిపాయీలు తటస్థపడ్డారు. పండితులు ఎటెళ్ళినా వారి తీరుతెన్నుల్ని, పనుల్ని చూసి, జనం వారిని విద్వాంసులుగానే భావించేవారు. వారి మాట తీరు, సంభాషణ, వేషధారణ, నడక ఇలా వారి ప్రతి కదలికా వారు విద్వాంసులని తెలియజేస్తాయి. ఇక్కడ కూడా అదే జరిగింది. హజ్రత్ తైమీ (రహ్మాలై)ని హజ్జాజ్ సిపాయీలు చూడగానే ఆయన పండితుడని గ్రహించారు. వెంటనే

ఆయన్ని అటకాయించి పేర్లు అడిగారు. సమాధానంగా "ఇబ్రాహీమ్" అన్నారు ఆయన. "తండ్రి పేరేంట"ని సిపాయిలడిగారు, "యజీద్" అన్నారు సమాధానంగా ఆయన.

"ఓహో! నువ్వేనన్న మాట ఇబ్రాహీమ్ బిన్ యజీద్‌వి" అంటూ సిపాయిలు నఖయీ (రహ్మాలై)కు బదులు తైమీ (రహ్మాలై)ని పట్టుకుని వెళ్ళి హజ్జాజ్ ముందు హాజరుపరిచారు. ఆయన్ని జైల్‌లో బంధించి బాగా హింసించండని హజ్జాజ్ ఆజ్ఞాపించాడు.

హజ్జాజ్ ఆజ్ఞానుసారం ఇబ్రాహీమ్ బిన్ యజీద్ తైమీ (రహ్మాలై) జైల్లో బంధించబడ్డారు. సిపాయిలు ఆయనకు అన్నపానీయాలను ఇవ్వడం ఆపేశారు. ఆయన్ని నీళ్ళల్లో ముంచేవారు, ఆయన కాళ్ళకు బరువయిన ఇనుప సంకెళ్ళు వేశారు. హజ్రత్ తైమీ (రహ్మాలై) ఈ బాధలన్నిటినీ భరించారుగాని, అసలు విషయాన్ని మాత్రం బయటపెట్టలేదు. అంటే, మీరు వెతుకుతుండిన ఇబ్రాహీమ్ బిన్ యజీద్ నఖయీ (రహ్మాలై) తాను కాదని ఆయన ఏనాడూ సిపాయిలకు తెలియజేయలేదు. అందువల్లనే ఆయన చాలా కాలందాకా జైల్లోనే పడివుండి అక్కడి ఘోరమయిన శిక్షల్ని అనుభవించాల్సి వచ్చింది. ఇలా ఈ బాధల్ని భరిస్తూ ఓ రోజు దైవ సాన్నిధ్యానికి చేరుకున్నారు. సరిగ్గా అదే రాత్రి ఓ స్వర్గనివాసి పరలోకానికేగినట్లు హజ్జాజ్ కలగన్నాడు. తెల్లవారిన తరువాత విచారిస్తే ఇబ్రాహీమ్ బిన్ యజీద్ చనిపోయారని హజ్జాజ్‌కు తెలిసింది.

ఈ దుర్మార్గుడు ఇబ్రాహీమ్ బిన్ యజీద్ తైమీ (రహ్మాలై) శవాన్ని చెత్తకుప్పపై విసిరేయించాడు. ఆ తరువాత హజ్జాజ్ తాను ఇబ్రాహీమ్ బిన్ యజీద్ నఖయీ (రహ్మాలై)ని మట్టుబెట్టించాననే భ్రమలో ఉండిపోయాడు.

సుబ్‌హానల్లా! ఎంత గొప్ప పని చేసివెళ్ళారు హజ్రత్ ఇబ్రాహీమ్ బిన్ యజీద్ తైమీ (రహ్మాలై)!! ఓ పుణ్యపురుషుని ప్రాణరక్షణకై తన ప్రాణాన్నే

త్యాగం చేశారు. ఆయనపై దైవకారుణ్యం కురియుగాక! మన పెద్దలకు లాగానే దైవం మనకూ అటువంటి పనుల్ని చేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక! మనమూ ఇతరులకు వీలయినంత ఎక్కువగా ఉపయోగపడేలా చేయుగాక! ఇతరుల ఇక్కట్లను తొలగించడంలో తమ ప్రాణాలుపోయినా లెక్కచేయని వారిగా చేయుగాక! దీన్నే త్యాగమని అంటారు. ఈ త్యాగానికి బదులుగా దైవం వద్ద మనకు లభించే పుణ్యఫలం అపారమైనది.

# హాఫిజ్ హాషీం బిన్ బషీర్ (రహ్మాలై)

1300 ఏళ్ళ క్రితం 'బుఖారా' అనే పట్టణంలో బషీర్ అనే ఓ వంట వాడుండేవాడు. అతను వంట చేయడంలో ఆరితేరిన వాడు. అతను చేసిన వంటకాల్ని కొనియాడుతూ మరీ తినేవారు. చేప వంట కాన్నయితే అనేక రకాల కొత్త కొత్త పద్ధతుల్లో తయారుచేసేవాడు. కాబట్టే అతన్ని ఆ రోజుల్లోని నవాబులు, రాజులు మంచి జీతమిచ్చి తమ వద్ద ఉంచుకునేవారు.

ఏ మనిషైనా తను ఓ పనిలో ప్రావీణ్యత సంపాదిస్తే, అంటే తను చేసే పనిలో మంచి సంపాదన లభిస్తుంటే, తన సంతానం కూడా అదే పనిచేస్తూ, బాగా డబ్బు గడించి సుఖంగా జీవితం గడపాలని అభిలషిస్తాడు. వంటవాడు బషీర్ కూడా ఇలాగే భావించేవాడు. అతనికి దేవుడు ఓ తెలివైన కుమారుణ్ణి ప్రసాదించాడు. అతని పేరు హాషీమ్. బషీర్ తన కుమారుణ్ణి వంట పనుల్లో పెట్టాలనుకున్నాడు. కాని హాషీమ్‌కు వంట పని మీద ఆసక్తే ఉండేది కాదు. అతనిలో విద్యనభ్యసించాలనే కోరిక గాఢంగా ఉండేది. అతని ఉద్దేశ్యంలో విద్య అంటే, ఈ రోజుల్లో కొంత మంది ఏదో చదివి ఉద్యోగం, ఊడిగం చేసు కుంటూ తిరిగే విద్య వంటిది కాదు. హాషీమ్ బిన్ బషీర్ అయితే ఖుర్ఆన్, హదీసుల జ్ఞానాన్ని సంపాదించాలని అభిలషించేవారు. "మనకు దైవాజ్ఞ

లేమున్నాయి? ప్రియప్రవక్త (సఅసం) దైవాజ్ఞల విషయంలో ఏమి సెలవిచ్చారు? ఆయన ఎలా వాటి ప్రకారం ఆచరించి చూపారు?'' అనే విషయాల్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉండేది హుషీమ్‌లో.

హుషీమ్ తన తండ్రికి ఎంతో విధేయత చూపించేవారు, తండ్రి మాటను ఏ మాత్రం జవదాటేవారు కాదు. వంట నేర్చుకుంటూనే తీరిక లభించినప్పుడల్లా ఖుర్‌ఆన్, హదీసు తెలిసిన విద్వాంసుల వద్దకు వెళ్ళేవారు. వారి ద్వారా ఖుర్‌ఆన్, హదీసుల్ని నేర్చుకుని వాటిని కంఠస్థం చేసవారు. దేవుడు ఆయనకు ఎంతో తెలివిని ప్రసాదించాడు. గురువులు తనకిచ్చిన పాఠాన్ని ఆయన ఎంతో తొందరగా కంఠస్థం చేసేవారు. అంతేగాక, దైవానుగ్రహం వల్ల ఒకసారి కంఠస్థం చేస్తే చాలు, ఇక ఎప్పుడూ ఆ విషయాన్ని ఆయన మరిచిపోయేవారు కాదు.

హుషీమ్ (రహ్మాలై) కాలంలో ప్రవక్త అనుయాయు (రజి)ల వద్ద ఖుర్‌ఆన్, హదీసుల జ్ఞానాన్ని అభ్యసించిన అనేక మంది పండితులు ఉండేవారు. వారిలో ''ఖాజీ అబూ షుఐబా (రహ్మాలై)'' ఒకరు. ఖాజీగారు ఓ పాఠశాలను ప్రారంభించారు. హుషీమ్ విద్యనభ్యసించడానికి ఆ పాఠశాలకు వెళ్ళడం ప్రారంభించారు. దీనివల్ల వంట పనిలో ఆటంకం ఏర్పడింది. దాంతో ఆయన తండ్రి అభ్యంతరం తెలుపుతూ, 'నాల్గు పైసలు వచ్చే పని చేసుకోవాలిగాని ఇదేమిటీ?' అని ఆగ్రహం వెలిబుచ్చాడు. అయినా హుషీమ్ ధ్యాసంతా చదువుపైనే ఉండేది. అందుకని ఆయన పాఠశాలకువెళ్ళి ఖాజీగారి వద్ద ఖుర్‌ఆన్, హదీసు విషయాల్ని నేర్చుకోవడం మానలేదు.

ఆ రోజుల్లోనే హుషీమ్ ఒకసారి అస్వస్థులయ్యారు. అందువల్ల పాఠశాలకు హాజరు కాలేకపోయారు. ఖాజీగారుఈ విషయాన్ని ప్రజల ద్వారా తెలుసుకుని ఓ రోజు హుషీమ్‌ను పరామర్శించడానికి బయలుదేరారు. ఇది తెలుసుకున్న మిగతా ఉపాధ్యాయులు కూడా ఖాజీగారి వెంట బయలుదేరారు. హుషీమ్

అంటే వీళ్ళందరికీ ఎంతో ప్రేమ. అతను యోగ్యతలు గల విద్యార్థి అని, కష్టపడి చదివేవాడని వీరికి తెలుసు. అందువల్లనే హాషీమ్‌పై ఉపాధ్యాయు లందరికీ ప్రేమభావం ఏర్పడింది.

వీళ్ళంతా తన ఇంటికి రావడం చూసిన బషీర్ నిశ్చేష్టుడైపోయాడు. అప్పుడుగాని అతనికి తెలిసిరాలేదు- విద్యతో మనిషి ఎంత ఎదిగిపోతాడోనని. ఖాజీగారు, ఆయన ఉపాధ్యాయులంతా కలిసి ఎవరింటికయినా వెళ్ళారంటే అది గొప్ప విషయం కదా! వీళ్ళను చూసి ఇరుగుపొరుగు అంతా గుమికూడి, "ఎంత అదృష్టవంతుడివయ్యా బషీర్ నువ్వు! కాబట్టే నీ ఇంటికి ఇంతటి గొప్పవారు వచ్చారు" అని అన్నారు. అయితే బషీర్ మాత్రం సంతోషంతో ఏమాత్రం తబ్బిబ్బవ్వలేదు. ఖాజీగారు బషీర్ ఇంట్లోకి వెళ్ళి హాషీమ్‌ను పరామర్శించి దుఆ చేశారు. ఆ తరువాత తిరిగి వెళ్ళిపోయారు.

ఖాజీగారు వెళ్ళిన తరువాత బషీర్ తన కుమారునితో అన్నాడు: "నేనింతవరకు నిన్ను విద్య నేర్చుకోనీయకుండా ఆటంకపరిచాను, అయితే ఇక నుంచి అలా చేయను. నీ గౌరవోన్నతుల కారణంగా ఖాజీగారే ఓ రోజు ఇక్కడికి వస్తారని, గొప్ప గొప్ప రాజుల వద్దకు ఖాజీగారు వెళితేనే చాలు, దాన్ని వారు తమ అదృష్టంగా భావిస్తారని నేను ఊహించనయినా ఊహించలేక పోయాను."

హాషీమ్ వ్యాధి నుండి కోలుకున్న తరువాత తండ్రి మాట ప్రకారం తన సమయాన్ని అత్యధికంగా పాఠశాలలోనే గడపసాగారు. ఎంతో కష్టపడి దీక్షతో చదవడం మొదలెట్టారు. విద్యాభివృద్ధికై ఇల్లు వాకిలి వదలి దూర ప్రదేశాలకు కూడా వెళ్ళడం ప్రారంభించారు. ఒక మహనీయుని వద్ద ప్రియప్రవక్త (సఅసం) హదీసు ఏదో ఉందని తెలిసి అక్కడికి చేరుకున్నారు. వెళ్ళి, "మహాశయా! మీరీ హదీసును ప్రవక్త సహచరుల ద్వారా ఏ విధంగా విన్నారో సెలవిస్తారా?" అని

అడిగారు. తరువాత ఆ మహనీయుడు ఏ విధంగా ఆ హదీసుని వివరించారో హాషీమ్ దాన్ని అదే రీతిలో కంఠస్థం చేసుకుని దాని ప్రకారం ఆచరణ కూడా ప్రారంభించారు.

అవును! ఆచరించడం మొదలెట్టేవారు. అందువల్లనే, ఆయనెప్పుడూ ఖుర్ఆన్, హదీసుల శోధనలో మునిగివుండేవారు. ఈ శోధనలోనే ఆయన మక్కా, మదీనా, బస్రా, కూఫా, బగ్దాద్ మొదలయిన ప్రదేశాలకు వెళ్ళారు. ఇంకా ఏ ఏ ప్రదేశాలకు వెళ్ళారోగాని గొప్ప గొప్ప విద్వాంసుల్ని, ఇమామ్‌లను కలుసుకుని అపార జ్ఞానాన్ని ఆర్జించారు. చివరికి హజ్రత్ అమ్రుద్ బిన్ దీనార్ (రహ్మాలై)ని కలిసి ఆయన ద్వారా కూడా హదీసు జ్ఞానాన్ని పొందారు. ఇక ఆయన ఎంత గొప్ప పండితుడు అయ్యారంటే ఆ కాలంలో ఆయనతో సరితూగే పండితులే లేకపోయారు. తరువాత ప్రజలు ఆయన్ని హాఫిజ్ ఇమామ్ హాషీమ్ అంటూ పిలుస్తూ ఆయన వద్దనే విద్యనభ్యసించడం ప్రారంభించారు. హాఫిజ్ ఇమామ్ హాషీమ్ (రహ్మాలై) బగ్దాద్‌లో ప్రజలకు విద్య బోధించడం ప్రారంభించగా ఆయనకు అనేక మంది శిష్యులయి పోయారు. వారిలో కొంత మంది: (1) ఇమామ్ మాలిక్ (రహ్మాలై)- భవిష్యత్తులో వీరు ఎంతో గొప్ప ఆలిమ్ అయ్యారు. (2) ఇమామ్ అహమద్ బిన్ హంబల్ (రహ్మాలై)- వీరు కూడా గొప్ప ఆలిమ్ అయ్యారు, (3) ఇమామ్ హమ్మాద్ (రహ్మాలై)- వీరు ఎంత గొప్ప ఆలిమ్ అయ్యారంటే, ఇమామ్ అబూ హనీఫా కూడా వీరి శిష్యుల్లో ఒకరు.

చూశారా! విద్య మనిషి గౌరవాన్ని ఎంత ఉన్నతం చేస్తుందో, హాఫిజ్ హాషీమ్ బిన్ బషీర్ (రహ్మాలై) కేవలం ఓ వంటవాని కుమారుడు. అయినా నేడు మనం హాఫిజ్ గారిని మన పెద్దలుగా, ఆదరణీయులుగా గౌరవిస్తున్నాం. అసలు విషయం ఏమంటే ఖుర్ఆన్, హదీసుల జ్ఞానం కలిగి ఉండటంతో

పాటు తదనుగుణంగా ఆచరించే వ్యక్తినే మనం మన గౌరవనీయులయిన పెద్దలుగా భావిస్తాం. మన దగ్గర సంపద కల్గినవారికి, గొప్ప వంశానికి చెందినవారికి, రాజులకు గౌరవ విలువలు లేవు. అందరికంటే అధికంగా దైవానికి భయపడేవారే మన దృష్టిలో అత్యంత గౌరవనీయులు. "ఇన్న అక్'రమకుమ్ ఇన్దల్లాహి అత్ ఖాకుమ్" అని ఖుర్ఆన్‌లో పేర్కొనబడింది. "ఎవరైతే మీలో అందరికంటే ఎక్కువగా దైవభీతి కలిగి ఉంటాడో అతనే దేవుని దృష్టిలో ఆదరణీయుడు, అధికుడు" అని దీని భావం. హాఫిజ్ హాషీమ్ (రహ్మాలై) హిజ్రీ 104లో జన్మించి, హిజ్రీ 183లో పరమపదించారు. ఆయనపై దైవ కారుణ్యం కురియుగాక!

# ఖాజా హసన్ బస్రి (రహ్మాలై)

దైవం మన గౌరవనీయులయిన పెద్దలకు ఎంతో ఉన్నత స్థానాన్ని ప్రసాదించాడు. అట్టివారిలో ఖాజా హసన్ బస్రి (రహ్మాలై) కూడా ఒకరు. ఈయన గౌరవాధిక్యతల్లో ఒకటేమిటంటే, ఈయన ఉమ్ముల్ మోమినూన్ (ముస్లిమ్‌ల మాతృమూర్తి) హజ్రత్ ఉమ్మె సల్మా (రజిఅన్) పాలు త్రాగారు. అంతేగాక ఆయన "ముస్లిమ్‌ల మాతృమూర్తులం"దరి ఇళ్ళకు వెళ్ళి వారి వద్ద ఖుర్ఆన్, హదీసుల జ్ఞానాన్ని, మంచి విషయాలెన్నింటినో నేర్చుకునేవారు. ఈయన ప్రియప్రవక్త అనుచరులయిన సహాబీల (రజి) వద్ద కూడా జ్ఞానసముపార్జన గావించారు. ఈయన చాలా కష్టపడేవారు. దీనికితోడు దైవం ఈయనకు మంచి గుణగణాల్ని కూడా ప్రసాదించాడు. అందుకనే బహుకొద్ది రోజుల్లోనే ఆయన గొప్ప ఆలిమ్ (ధర్మవేత్త)గా తయారయ్యారు. అంతేకాదు, తను అభ్యసించిన ఖుర్ఆన్, హదీసుల జ్ఞానం ప్రకారం నడుచుకుంటూ దాన్ని ఇతరులకు కూడా చేరవేసేవారు.

ఈయనకు ఎల్లవేళలా పరలోకపు జవాబుదారీ భావన, దైవాగ్రహపు చింతన ఉండేది. "తన వలన ఏ తప్పు జరిగిందో, దైవాగ్రహాన్ని కల్గించే ఏ మాట తన నోటి ద్వారా వెలువడిందో, దీనివలన తీర్పుదినాన తను ఎక్కడ దుర్మార్గుల్లో చేరిపోతానో" అని ఆయన ఎల్లప్పుడూ భయపడుతూ ఉండేవారు. ఈ కారణంగానే ఆయన దైవానికి ఇష్టమయిన పనుల్నే చేసేవారు, ధన సంపదలు, ఇంకా డాబుదర్పాల గురించిన ఆలోచనే ఈయనకు వచ్చేదికాదు. చాలా మంది ప్రజలు ధనాన్ని సంపాదించి దైవాన్ని మరచిపోతూ ఉంటారని ఈయన అంటూ ఉండేవారు.

ఈయన కాలంలో ఓ గొప్ప దౌర్జన్యపరుడు రాజయ్యాడు. దౌర్జన్యం చేయడం మూలానే అతను ఎంతో అపకీర్తిపాలయ్యాడు. అతని పేరు హజ్జాజ్ బిన్ యూసుఫ్. ఓసారి అతను అత్యంత అందమైన, పటిష్టమైన ఓ మహల్‌ను నిర్మించాడు. అందులో అన్ని రకాలయిన ఆడంబరపు వస్తువులు అమర్చి దాన్ని తిలకించడానికి ప్రజల్ని ఆహ్వానించాడు. దానిని చూసిన ప్రతివాడూ పొగడకుండా ఉండలేకపొయ్యాడు.

జనమంతా వచ్చినా ఖాజా హసన్ బస్రి (రహ్మాలై) రాకపోయేసరికి హజ్జాజ్ ఆయన్ని పిలవనంపాడు. ఆయనయితే వెళ్ళేవారుకాదుగాని, జనవాక్యం విని వెళ్ళక తప్పలేదు. మహల్ అందాన్ని, అందులో అమర్చిన వస్తువుల్ని చూసి తిరిగి వెళుతున్న ఖాజా హసన్ బస్రి (రహ్మాలై)తో, "ఖాజా సాహెబ్! ఈ మహల్‌లో ఏ లోపం లేదు కదా? ఒక వేళ ఉంటే చెప్పండి, దాన్ని వెంటనే సరిచేద్దాం" అని హజ్జాజ్ అడిగాడు. "ఒక లోపం ఉంది, అది కూడా మామూలు లోపం కాదు, చాలా పెద్ద లోపం" అని సమాధానమిచ్చారు ఖాజా (రహ్మాలై). "ఆ లోపం ఏమిటి?" అడిగాడు హజ్జాజ్. దానికి ఖాజా (రహ్మాలై) ఇలా అన్నారు: "ఒకానొక రోజు ఈ మహల్, అందులోని వస్తు సామగ్రి అంతా పాతదై,

వినాశమవుతుంది (అంటే నశించిపోతుంది). ఎవ్వరూ ఈ లోపాన్ని దూరం చెయ్యలేరు. ఎప్పుడూ పాతబడకుండా, నాశనం కాకుండా శాశ్వతంగా ఉండే మహల్‌ని నిర్మించుకోవడానికి ప్రయత్నించేవాడే వివేచనాపరుడు. (అంటే దైవం సజ్జనులయిన తన దాసులకు ప్రదానం చేసే స్వర్గసౌధం అని అర్థం)."

ఇది విని హజ్జాజ్ మనసులో చిర్రెత్తిపోయాడుగాని, పైకి మాత్రం ఏమీ అనలేకపోయాడు. అయితే ఒక్క మాట అన్నాడు- "పాపం, ఈయన చాలా ముసలివారయిపోయారు" అని తర్వాత ఆయన్ని పంపివేశాడు.

రాజుల దగ్గరయినా సరే, నిర్భయంగా, నిక్కచ్చిగా, సూటిగా తాము చెప్పదలుచుకున్నదేదో చెప్పేవారు మన పెద్దలు. వీరిని మనం ఆదర్శంగా తీసుకుంటే మనమూ ఎవరికీ భయపడం. ఇది ఎలా సాధ్యమవుతుందంటే- మనం దైవానికి భయపడుతూ ఉండాలి. మనసులో దైవభీతి ఉంటే చాలు. మరే భయం దరికిరాదు. అటువంటి మనిషి ఏ భయప్రలోభాలకూ లొంగడు

# ఖాజీ షురైహ్ (రహ్మాలై)

మన గౌరవనీయులైన పెద్దలలో ఓ ప్రఖ్యాత ఖాజీగారుండే వారు. న్యాయస్థానంలో కూర్చుని తీర్పు చేప్పేవారిని ఖాజీ అంటారు. ఈ రోజుల్లో అతన్నే మనం జడ్జ్ అని అంటున్నాం. ఖాజీ లేక జడ్జ్ (న్యాయమూర్తి) ఎవరి ఒత్తిడులకు లొంగక, మరే లాలూచీకి పాల్పడకుండా సరియైన తీర్పును ఇవ్వాలి. న్యాయమూర్తి కేవలం దైవానికే భయపడాలి. ఒకవేళ అతను ఎవరి కయినా భయపడో లేక మరే లాలూచీకయినా లొంగిపోయో సరి అయిన తీర్పును ఇవ్వనట్లయితే ప్రళయదినాన దైవం అతనికి కఠిన శిక్షను విధిస్తాడని గ్రహించాలి.

పరలోక భీతికల ఖాజీ లేక న్యాయమూర్తి మాత్రమే సరి అయిన తీర్పును ఇవ్వగలడు. మన పెద్దలలో కూడా అనేక మంది న్యాయమూర్తులుగా వ్యవహరించారు. వారు చక్రవర్తులకు భయపడేవారు కాదు. పైగా వారికే వ్యతిరేకంగా తీర్పులిచ్చిన సందర్భాలున్నాయి. భయప్రలోభాలకు లొంగి వారు ఎప్పుడూ తప్పుడు తీర్పును ఇవ్వలేదు. అలాంటి ఓ న్యాయమూర్తిగారి రెండు మూడు తీర్పుల్ని నేడు మీ ముందుంచుతున్నాము. ఆయన పేరు ఖాజీ షురైహ్ (రహ్మలై).

ఓసారి హజ్రత్ ఉమర్ (రజి) ఓ గుర్రాన్ని కొన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఎంతో మంచి ఖలీఫా అని అందరికీ తెలుసు. గుర్రాన్ని కొన్న తర్వాత, దాని మంచీ చెబ్బరల్ని చూడటానికి ఓ మనిషిని నియమించారు. ఆ వ్యక్తి స్వారీ చేస్తున్నప్పుడు గుర్రానికి గాయాలయి, అదికాస్తా కుంటిదైపోయింది. అందువల్ల హజ్రత్ ఉమర్ (రజి) ఆ గుర్రాన్ని యజమానికే వాపసు ఇచ్చేయ దలిచారు. కాని అందుకు అతను అంగీకరించలేదు. తరువాత హజ్రత్ ఉమర్ (రజి) కోర్టులో దావా వేశారు. ఆ సమయంలో ఆ కోర్టుకు హజ్రత్ షురైహ్ (రహ్మలై) న్యాయమూర్తిగా ఉన్నారు.

కొన్న తర్వాతనే, గుర్రానికి అంగవైకల్యం ఏర్పడింది. కాబట్టి వాపసు తీసుకోబడదని న్యాయమూర్తి తీర్పు విన్పించారు.

చూశారా! ఈ తీర్పు ముస్లిమ్‌ల ఖలీఫాకు వ్యతిరేకంగా ఇవ్వబడింది. న్యాయమూర్తి ఖలీఫాకు ఏ విధంగానూ భయపడలేదు. హజ్రత్ ఉమర్ (రజి) కూడా ఎంతో మంచి న్యాయ పరిపాలకులు కాబట్టి ఆ తీర్పు విని సంతోషించడమే కాకుండా హజ్రత్ షురైహ్ (రహ్మలై)గారిని 'కూఫా' పట్టణానికి ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు.

ఖాజీ షురైహ్ (రహ్మలై)కు ఓ సుపుత్రుడు ఉన్నాడు. మొత్తానికి ఏం

జరిగిందోగాని, అతను ఓ వ్యక్తితో లావాదేవీలు జరపడంలో తగాదా వచ్చింది. నిజానికి ఈ తగాదాలో తన కుమారుడే తొందరపడ్డాడు. పైగా ఆ యువకుడే ఆ వ్యక్తిపై దావా వేయాలని ఆలోచించాడు. ఎటూ తన తండ్రి న్యాయమూర్తిగా ఉన్నారు. దావా వేసే ముందు తన తండ్రి దగ్గర సలహా తీసుకున్నాడు. తన పక్షాన గెలుపు అయితేనే దావా వేస్తానని తండ్రితో అన్నాడు.

న్యాయమూర్తి అయిన తండ్రి కొంతసేపు ఆలోచించి, దావా వేయమని అన్నారు. ఆ యువకుడయితే ఫిర్యాదును దాఖలు చేశాడు గాని తీర్పు మాత్రం అతనికి వ్యతిరేకంగా ఇవ్వబడింది. అందుకు అతను ఆగ్రహం చెంది, "ముందే ఈ విషయం తెలియజేస్తే నేను దావా దాఖలు చేసేవాణ్ణే కాద"ని తండ్రితో అన్నాడు. దానికి తండ్రి సమాధానమిస్తూ, "బాబూ! నేనీ విషయం ముందుగా నీకు తెలియజేసి ఉంటే, నీవు లాభనష్టాలతో నిమిత్తం లేకుండా కొంచెం ఎక్కువో తక్కువో నీ భాగస్వామితో రాజీ చేసుకుని నీవు అన్యాయానికి ఒడిగట్టేవాడివి" అని అన్నారు. ఆ తరువాత ఆయన, "చూడు నాయనా! ఈ ప్రపంచంలో అందరికంటే నీవే నాకు ప్రియమయినవాడివి. అయితే నీకంటే దేవుడు అత్యంత ప్రియమయినవాడు" అని అన్నారు.

అమీరుల్ మోమినీన్ హజ్రత్ ఉమర్ (రజి) పట్ల, తన కుమారుని పట్ల చేసిన తీర్పులు ఇంతవరకు మీరు చదివారు. ఇక ఇంకో తీర్పును తెలుసుకోండి. హజ్రత్ ఉమర్ (రజి) తరువాత హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖలీఫాగా నియమింపబడ్డారు. ఆయన తరువాత హజ్రత్ అలీ (రజి) ఖలీఫా అయ్యారు.

ఓసారి హజ్రత్ అలీ (రజి) గారి ఇనుప కవచం ఎక్కడో జారిపడి పోయింది. అది ఓ యూదునికి దొరికింది. దాన్ని చూసిన హజ్రత్ అలీ (రజి) ఆ కవచం తనదని, తిరిగి ఇవ్వమని ఆ యూదునితో అన్నారు. అయితే అతను దాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తూ, అది తనదేనని బుకాయించాడు. ఎంత అబద్ధం!!

అతనిలో దైవభీతి లేదు కాబట్టే అంతటి అబద్ధం చెప్పడానికి కూడా జంకలేదు ఆ యూదుడు. చివరికి హజ్రత్ అలీ (రజి) అతనిపై న్యాయస్థానంలో ఫిర్యాదును దాఖలు చేశారు. అప్పుడు కూడా హజ్రత్ షురైహ్ (రహ్మలై) న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు.

"ఏ ఆధారంతో నీవు, ఈ కవచం నీదని అంటున్నావు?" అని ఖాజీగారు ఆ యూదుని అడిగారు. సమాధానంగా అతను, "మీరే చూస్తున్నారుగా, ఈ కవచం నా దగ్గర ఉండటాన్ని, ఇంకా ఇంతకు మించి నేనేమి చెప్పగలను" అన్నాడు యూదుడు.

తర్వాత ఖాజీగారు, "ఇది మీదని చెప్పడానికి మీరెవరినయినా సాక్ష్యం తీసుకురాగలరా?" అని హజ్రత్ అలీ (రజి) ని అడిగారు. అప్పుడు హజ్రత్ అలీ (రజి) తన కుమారుడు హజ్రత్ హసన్ (రజి)ని, తన బానిస ఖబజ్‌ని సాక్షులుగా ప్రవేశపెట్టారు, ఖాజీగారు హజ్రత్ అలీ (రజి) కుమారుని సాక్ష్యాన్ని నిరాకరిస్తూ, రెండవ సాక్షిగా మరెవరినయినా తెచ్చుకోమని అన్నారు. కాని, హజ్రత్ అలీ (రజి) రెండవ సాక్షిగా ఎవరినీ ప్రవేశపెట్టలేకపోయారు. చివరికి ఖాజీగారు తన తీర్పును ఈ విధంగా వినిపించారు: "నేను తండ్రి వ్యాజ్యంలో తనయుని సాక్ష్యాన్ని అంగీకరించను. తరువాత అలీగారు రెండవ సాక్షిని ప్రవేశపెట్టలేక పోయారు. ఇక అలీకి ఒకే ఒక సాక్షి మిగిలాడు. అందువలన ఈ కవచం యూదునిదేనని నిర్ధారించడం జరిగింది."

చూశారా! హజ్రత్ అలీ (రజి) కూడా ఓడిపోయారు. అయితే ఖాజీగారి సమయస్ఫూర్తి, న్యాయనిర్ధారణ పట్ల హజ్రత్ అలీ (రజి) మిక్కిలి సంతోషించారు. ఇంకా ఏం జరిగిందో చదవండి. ఖాజీగారు న్యాయంగా తీర్పునిచ్చారు కాబట్టి, అలీ (రజి) ఎటూ సంతోషించవలసిందే. అయితే ఎటువంటి పక్షపాతం, వివక్షలేని ఈ తీర్పు యూదుని మనస్సుపై ఎంతటి ప్రభావాన్ని వేసిందంటే

చివరికి అతను ముస్లిమ్‌గా మారిపోయాడు. తర్వాత అతను హజ్రత్ అలీ (రజి) వద్దకు వచ్చి, "ఇదిగో తీసుకోండి మీ కవచాన్ని, ఎంతటి సత్యధర్మం మీది! ముస్లిమ్‌ల ఖాజీ ఖలీఫాకే వ్యతిరేకంగా తీర్పునివ్వడమా!!" అని తన ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచాడు.

అతను ముస్లిమ్‌గా మారడం పట్ల హజ్రత్ అలీ (రజి) తన సంతోషాన్ని తెలియజేస్తూ, ఆ కవచాన్ని అతనికే తిరిగి ఇచ్చేశారు.

మీరు ఈ మూడు తీర్పులను మాత్రమే చదవగలిగారు. ఆ ఖాజీగారివి ఇంకా ఇటువంటి వేలకొలది తీర్పులు ఉన్నాయి. ఆయన 60 సంవత్సరాలు ఖాజీగా పనిచేశారు. అయితే ఖాజీగారు ఇంతటి మంచి తీర్పులు ఎలా ఇవ్వగలిగారో మీరు గ్రహించారా? అసలు విషయమేమంటే ఆయన ధర్మజ్ఞానాన్ని బాగా చదివి ఆకళింపు చేసుకున్నారు. ప్రియప్రవక్త (సఅసం) గారి గౌరవనీయులయిన అనుచరుల (రజి) ద్వారా ఈయన ఖుర్‌ఆన్, హదీసుల జ్ఞానాన్ని, ఇంకా ఫికహ్ విద్యను నేర్చుకున్నారు. మరో విషయమేమిటంటే, దైవం కూడా ఆయనకు ఎంతో గ్రహణ శక్తిని అనుగ్రహించాడు. ఈయన గురువుల్లో హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ అలీ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి), హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) వంటి గొప్ప సహాబీలు చేరివున్నారు. దైవం వారిపట్ల ప్రసన్నుడవుగాక!

రెండవ ముఖ్య విషయమేమిటంటే, ఖాజీ షురైహ్ (రహ్మాలై) దైవానికి ఎంతో భయపడేవారు. అంతిమ దినపు లెక్క విషయం పట్ల ఆయన ఎంతో చలించిపోయేవారు. అలా పరలోక భీతి ఉండబట్టే తన తీర్పుల్లో ఆయన ఖలీఫా కదా అని లొంగిపోలేదు, అలాగే తన తనయుణ్ణి కూడా లక్ష్యపెట్టలేదు. అందువలననే ఆయన తీర్పుల్లో ఎటువంటి పక్షపాతం కన్పించేది కాదు. అందుకే, ప్రజలు ఆయన తరువాత నేటి వరకు అంతటి గొప్ప ఖాజీ లేక జడ్జ్

ఎవరూ కాలేకపోయారని అనుకుంటూ ఉంటారు. ఓ అల్లాహ్! నేడు కూడా అటువంటి ఖాజీలనే మాకు ప్రసాదించు, ఓ దేవా! హజ్రత్ ఖాజీ షురైహ్ (రహ్మాలై) లానే మాకూ నిజాయితీ, నిష్పక్షపాతాల సద్బుద్ధిని ప్రసాదించు, ఇంకా మా మనస్సుల్లో నీ భయం తప్ప ఇంకెవరి, ఎలాంటి భయాన్నీ, లాలూచీనీ ఉంచకు. (ఆమీన్).

# ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై)

మన పెద్దల్లో గొప్ప ధర్మవేత్తలు, నాయకులు కూడా కొందరున్నారు. ఒకవేళ అల్లాహ్ వారిని పుట్టించి ఉండకపోతే మనం ఏ విధంగా నమాజ్ ఆచరించాలో, ఏ విధంగా వుజూ చేయాలో, ఏ విధంగా రోజా (ఉపవాస వ్రతం) పాటించాలో, ఏ విధంగా హజ్ నిర్వర్తించాలో, ఇంకా హరామ్ (నిషిద్ధమయినవి), హలాల్ (ధర్మబద్ధమయినవి) అంటే ఏమిటో ఈనాడు మనకు తెలిసివుండేది కాదు. ఈ పెద్దలందరిలో గొప్ప ఇమామ్ (నాయకు)లుగా ప్రసిద్ధికెక్కినవారు వీరు: ఇమామ్ మాలిక్ (రహ్మాలై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై), ఇమామ్ షాఫయి (రహ్మాలై), అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై), ఇమామ్ అబూ యూసుఫ్ (రహ్మాలై), ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) మొదలయినవారు.

ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) ఒక బానిస కుమారుడు. పూర్వకాలంలో బానిసలకు ఎవరూ మర్యాదనిచ్చేవారు కాదు. గొర్రెలు, మేకలు, కూరగాయల్లాగా బానిసల అమ్మకం, కొనుగోలు జరుగుతుండేది. యజమాని తన ఇష్టానుసారం వారిని వాడుకోవటం, తిండి పెట్టడం, బట్ట లివ్వడం జరిగేది. జంతువుల మాదిరిగా రేయింబవళ్ళు ఊడిగం చేయించుకుని ఎంతో కొంత దయదలచి తినడానికి వారి మొఖాన పారేసేవారు. అయితే అల్లాహ్ మహనీయ ముహమ్మద్

(సఅసం) ను తన చివరి ప్రవక్తగా ప్రభవింపజేసిన తరువాత ఆయన (సఅసం) బానిసలకు వారి వారి హక్కుల్ని ప్రదానం చేశారు. ఆయన (సఅసం) ప్రవచించారు: "బానిసలు కూడా మీలాంటి దైవదాసులయిన మానవులే. మీ కుమారులు, సోదరులతో ఎలా ప్రవర్తిస్తారో, వారితో కూడా అలానే ప్రవర్తించండి." ప్రియప్రవక్త (సఅసం) మాదిరిగానే ఆయన అనుయాయులు (రజి) కూడా ఈ విషయాన్ని ఆచరించి బానిసల్ని తమ కుమారుల్లా గౌరవించారు. వారిని చూసిన ఇతర ప్రజానీకం కూడా బానిసల్ని కనికరించి తమ ఇంటి వారిని ఎలా పోషించేవారో అలానే వారి ఆలనాపాలనా చేస్తూ ఉండేవారు. ఇంకా, వారికి విద్యాభ్యాసం చేయించేవారు. ఫలితంగా బానిసల్లో ఎలాంటి మహామహులైన జ్ఞానులు తయారయ్యారంటే ఇతరుల్లో కూడా అలాంటివారు జన్మించలేదు. ఇదంతా దైవకృప మరియు ఇస్లామ్ శిక్షణా సౌభాగ్యమే. ఈ బానిసల్లో మంచి మంచి చక్రవర్తులు, గొప్ప సైనిక యోధులు, ఆలిమ్‌లు, ఇమామ్‌లు జననమొందారు. ఇంకా, ఈ బానిసలు ఎలాంటి మంచి పనులు చేశారంటే- వాటి ఫలితంగానే మనం వారిని గౌరవనీయులుగా, మన పెద్దలుగా ఆదరిస్తున్నాం, వారి మూలానే మనకు గౌరవం లభించింది.

హజ్రత్ ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) తండ్రి హసన్ ఓ బానిస. ఈయన డెమస్కస్‌కు సమీపంలో ఉన్న 'హరస్తా' అనే గ్రామంలో నివసిస్తూ బనూ షయబాన్ తెగకు సేవ చేస్తూ ఉండేవారు. ఈయన ఓ సిపాయి కావడాన సైనిక పటాలంలో "వాస్తా" అనే పట్టణానికి వెళ్ళారు. ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) ఈ వాస్తాలోనే జన్మించారు. ఆ కాలంలో ప్రియప్రవక్త (సఅసం) ప్రియ అనుయాయుల శిష్యులు, అంటే సహాబీలను చూసినవారు జీవించివున్నారు. వీరిలో పెద్ద పెద్ద ఇమామ్‌లు ఉన్నారు. ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) హిజ్రీ 132వ శకంలో జన్మించారు.

ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) తండ్రి హసన్ తన జీవిత కాలంలో ఎంతో ధనాన్ని కూడబెట్టారు. ఆయన పరలోకానికెళ్ళే సమయంలో ముప్పై వేల దిర్హమ్‌లు వదలివెళ్ళారు. ఇది ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై)కు దక్కింది. ఇమామ్‌గారికి ఖుర్ఆన్, హదీసులంటే ఎంతో ఇష్టం. దేవుడు ఆయనకు మంచి అవగాహనా శక్తిని కూడా ప్రసాదించాడు. ఆయన ఈ మొత్తం పైకాన్ని ఖుర్ఆన్, హదీసుల్ని అభ్యసించడానికే వెచ్చించారు. ఎవరయినా గొప్ప ఆలిమ్ లేక ఇమామ్ పేరు వింటే చాలు, ఇక అక్కడికి చేరుకుని ఎంతో శ్రమపడి విద్యనభ్యసించే వారు. ఈ విధంగా ఆయన గొప్ప గొప్ప ఇమామ్‌ల చెంత జ్ఞానసముపార్జన చేశారు. ఆయన గురువుల్లో, ప్రత్యేకంగా ఇమామ్ మాలిక్ (రహ్మాలై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై)లు చెప్పుకోదగినవారు.

ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) ఎంతో అందమైనవారు. ప్రసిద్ధి చెందిన విషయమేమిటంటే - ఆయన తండ్రి విద్యాభ్యాసానికై పాఠశాలలో చేర్చడానికి ఆయన్ని వెంటబెట్టుకుని ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) వద్దకు వెళ్ళినప్పుడు ఆయన అందాన్ని చూసి అబూ హనీఫా అబ్బురపడ్డారు. ఆయనలో జ్ఞానసముపార్జన పట్ల మక్కువ, కష్టపడి చదివే ఓపిక, ఇంకా మంచి అవగాహనా శక్తిని చూసిన ఇమామ్ హనీఫా ఎంతో శ్రమపడి ఆయనకు విద్య గరిపారు. దైవానుగ్రహం వలన ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) ఇరవై సంవత్సరాల ప్రాయంలోనే గొప్ప ఆలిమ్‌గా తయారై ఇతరులకు విద్య నేర్పడం మొదలెట్టారు.

జ్ఞాన పిపాసులయిన ఈయన మదీనాలో ఉన్న ఇమామ్ మాలిక్ (రహ్మాలై) వద్దకు వెళ్ళారు. మూడు సంవత్సరాలు వారి వద్ద గడిపారు. ఆ కాలంలో ఆయన ఇమామ్ మాలిక్ (రహ్మాలై) సమీకరించిన హదీసులన్నింటిని నేర్చుకున్నారు. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) వద్దకు చేరిన తొలి రోజుల్లో ఆయనతో ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) ఇలా ప్రశ్నించారు: "గురువు గారూ!

ఈ విషయం చెప్పండి- ఒక వ్యక్తి అపరిశుభ్రంగా ఉన్నాడు. నీళ్ళు మస్జిద్‌లో ఉన్నాయి. ఆ స్థితిలో అతను మస్జిద్‌లోకి వెళ్ళడం భావ్యం కాదు. నమాజ్ వేళ దగ్గరపడుతుంది. ఈ సమయంలో ఆ వ్యక్తి ఏం చెయ్యాలి? మస్జిద్‌లో ఉన్న నీటిని అతను ఎలా తీసుకోవాలో సెలవియ్యండి."

సమాధానంగా ఇమామ్ మాలిక్ (రహ్మాలై), "అపరిశుభ్రంగా ఉన్న పరిస్థితిలో అతను మస్జిద్‌లో ప్రవేశించడానికి వీల్లేదు" అని అన్నారు. "అయ్యా! మీరన్నది నిజమే. మరి నమాజ్ వేళ మీరిపోతుందిగదా!" అన్నారు ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై). 'అయితే మీరే చెప్పండి, ఆ వ్యక్తి ఏం చెయ్యాలో?' అని ఇమామ్ మాలిక్ (రహ్మాలై) అన్నారు. అప్పుడు ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) ఇలా అన్నారు: "ఆ వ్యక్తి మస్జిద్ వెలుపల తయమ్ముమ్ చేసుకుని తరువాత మస్జిద్‌లోకి వెళ్ళి నీరు తీసుకుని స్నానం చేయాలి. తరువాత నమాజ్ చేయాలి." ఇమామ్ మాలిక్ (రహ్మాలై) ఈ సమాధానం విని ఎంతో సంతోషించారు. తరువాత ఆయన ఇమామ్ ముహమ్మద్(రహ్మాలై), ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై)కు శిష్యులని తెలిసి ఆయన్ని తన వద్దనే ఉంచుకున్నారు. ఈ విధంగా ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై) అక్కడ మూడేండ్లు గడిపి, తన విద్యాజ్ఞానాలతో ఇమామ్ మాలిక్ (రహ్మాలై)ని ఎంతో సంతోషపెట్టారు. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) తను సమీకరించిన ఏడు వందల హదీసుల్ని ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై)కు ధారాదత్తం చేశారు. వీటన్నింటిని వంటబట్టించుకున్నారు ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై). తరువాత ఆయన విద్యాజ్ఞానాల కీర్తికాంతులు నలువైపులా వ్యాపించిపోయాయి. దాంతో ఆనాటి మేటి పండితులంతా "ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై)కు సాటి మరే ఆలిమ్ లేడ"ని సమాధానపడ్డారు.

దైవం అనుగ్రహించిన పాండిత్యాన్ని, ఆలిమ్ హోదాను ఆయన అన్ని విధాలా నిలబెట్టుకోగలిగారు. ఇతరులకు కూడా ఆయన బాగా జ్ఞానబోధ

చేశారు కాబట్టే ఆయన శిష్యుల్లో అనేక మంది గొప్ప ధర్మవేత్తలుగా తయారయ్యారు. ఆ శిష్యుల్లో ఇమామ్ షాఫయి (రహ్మాలై) కూడా ఒకరు. ఇమామ్ షాఫయి (రహ్మాలై) ఇలా అన్నారు: "నేను ఇమామ్‌గారిని మించిన ఆలిమ్‌నిగాని, వివేచనాపరుణ్ణిగాని, బోధకుణ్ణిగాని ఇంకెవర్నీ చూడలేదు." దేవుడు ఇమామ్ ముహమ్మద్‌కు ఎంత అందాన్నిచ్చాడో అంతే శీలాన్నీ ఇచ్చాడు.

ఆయన పేరు ప్రఖ్యాతులు విన్న ఖలీఫా హారూన్ రషీద్ ఆయన్ని తన ఆస్థానంలో అత్యున్నత ఖాజీ (న్యాయమూర్తి) స్థానంలో నియమించాడు. దాన్ని ఇమామ్ అంగీకరించారు. అయితే ఆయన ఖలీఫాకు చాకిరీ చేసే నౌకరుగా మాత్రం ఎప్పుడూ మసలుకునేవారు కాదు. దారిలో ఇమామ్‌గారు తటస్థపడితే ఖలీఫాయే ముందుగా సలామ్ చేసేవాడు. ఆయనెప్పుడూ ఖలీఫా గౌరవార్థం లేచి నిలబడలేదు.

ఒకసారి ఇమామ్‌గారి దగ్గర ఎంతో మంది ప్రజలు కూర్చుని ఉన్నారు. అంతలో ఖలీఫా హారూన్ రషీద్ వచ్చాడు. అప్పుడు అతని గౌరవార్థంఅందరూ లేచి నిల్చున్నారు. కాని ఇమామ్‌గారు కూర్చునే ఉన్నారు. అందుకు ఖలీఫా, "మీరు నా గౌరవార్థం ఎందుకు లేవలేద"ని ప్రశ్నించాడు. సమా ధానంగా ఇమామ్‌గారన్నారు:"ఎవరయితే ప్రజలు తనను గౌరవించాలని అనుకుంటాడో అలాంటి వ్యక్తి నరకంలో తన స్థానాన్ని భద్రపరచుకున్నట్లే."

ఇది విన్న ఖలీఫా తల దించుకుని మరెన్నో ప్రశ్నలడిగాడు. అతనడిగిన ప్రతి ప్రశ్నకు సరయిన సమాధానమిస్తూ పోయారు ఇమామ్‌గారు. అందుకు ఖలీఫా సంతోషించి ఓ పెద్ద మొత్తాన్ని ఇమామ్‌కు కానుకగా పంపాడు. ఇమామ్‌గారు ఆ మొత్తాన్ని బీదసాదలకు పంచిపెట్టారు.

ఇమామ్‌గారు తన శిష్యుల్లో ఎవరయినా పేదవాళ్ళుంటే వారికి డబ్బునిచ్చేవారు, ఎవరయినా రుణగ్రస్తులుంటే వారి రుణాన్ని తీర్చేవారు.

ఆయనకు ఇమామ్ షాఫయి (రహ్మలై) అంటే ఎంతో ఇష్టం. కాబట్టే ఆయనకు ఒక ఒంటె మోసే అన్ని పుస్తకాలిచ్చి సాగనంపారు.

ఒకసారి ఆయన ఇమామ్ షాఫయి (రహ్మలై)ని ఒక హత్యాప్రయత్నం నుంచి తప్పించారు. అసలేం జరిగిందంటే- కొంత మంది వ్యక్తులు ఖలీఫా హారూన్ రషీద్‌పై తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ సైన్యం దాన్ని అణచి ఎంతో మందిని పట్టుకుంది. అయితే ఎలా జరిగిందో ఏమోగాని ఈ పట్టుబడిన వారిలో ఇమామ్ షాఫయి (రహ్మలై) కూడా ఉన్నారు. ఇక అందరినీ వధించండని ఖలీఫా అజ్ఞాపించాడు. అయితే ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ షాఫయిని ఎలాగోలా తప్పించి ఆయన్ని నిర్దోషిగా నిరూపించారు.

ఇమామ్ ముహమ్మద్ (రహ్మలై) ఎన్నో గ్రంథాల్ని రాశారు. వీటి ఆధారంగానే మనం నేడు నమాజ్, రోజాలను పాటిస్తున్నాం. జకాత్ చెల్లిస్తున్నాం, హజ్ నిర్వహిస్తున్నాం, ఇంకా హరామ్ (నిషిద్ధం), హలాల్ (ధర్మబద్ధమయినవి)ల మధ్య తేడాలను తెలుసుకుంటున్నాం. ఈయన ఇలాంటి తొమ్మిది వందల తొంభై తొమ్మిది పుస్తకాల్ని వ్రాశారు.

దేవుడు మన పెద్దల్లో ఇమామ్ ముహమ్మద్ (రహ్మలై) లాంటి గౌరవనీయుల్ని పుట్టించి మనకెంతో మేలు చేశాడు. ఆయన విజ్ఞానం, పాండిత్యంతో కూడుకున్న ఎన్నో పుస్తకాల్ని రచించారు. ఇలా ఆయన ఎన్నో మంచి మంచి పుస్తకాల్ని వ్రాసి దైవాదేశాల్ని, దైవప్రవక్త (సఅసం) హితవుల్ని అవలీలగా అర్థం చేసుకుని ఆచరించే మార్గాన్ని సుగమం చేశారు.

హిజ్రీ 189 శకంలో ఇమామ్ ముహమ్మద్ (రహ్మలై) పరమపదించారు. అప్పుడు ఆయన వయస్సు 57 సంవత్సరాలు. ఆయన మరణవార్త విన్న ప్రతివారూ ఎంతో దుఃఖించి, "ఓ దేవా! ఇమామ్ ముహమ్మద్ (రహ్మలై) పై నీ అపార అనుగ్రహాల్ని కురిపించు, వారిలానే మాకూ నీ ధర్మోన్నతికై పాటు పడే సద్బుద్ధిని ప్రసాదించు" అని దైవాన్ని వేడుకున్నారు.

# హజ్రత్ జాఫర్ సాదిఖ్ (రహ్మాలై)

పూర్వం మన్సూర్ అబ్బాసీ అనే ఓ రాజు ఉండేవాడు. అతను ఎంతో గొప్ప చక్రవర్తి. తన రాచరికాన్ని చూసుకుని అతను గర్వంతో విర్రవీగుతుండే వాడు. ఒకసారి అతను తన మంత్రులతో, నాయకులతో కొలువుదీరి కూర్చుని ఉన్నాడు. ఆ సభలో ఓ వైపు కొంత మంది ఆలిమ్‌లు కూడా ఆసీనులయి ఉన్నారు. మన్సూర్ ఏదో బిగ్గరగా మాట్లాడుతూ ఉన్నాడు. అంతలో ఓ ఈగ వచ్చి అతని ముఖంపై వాలింది. మన్సూర్ దాన్ని తన చేత్తో పారద్రోలాడు. ఆ ఈగ మళ్ళీ అదే స్థానంలో వచ్చి వాలింది. మన్సూర్ మళ్ళీ దాన్ని తరిమాడు. సాధారణంగా ఈగలు మహా మొండిగా ఉంటాయి. అది మళ్ళీ వచ్చి అదే స్థానంలో వాలింది. మన్సూర్ మళ్ళీ తోలాడు. అది వచ్చి వాలడం, అదే పనిగా దాన్ని అతను తోలటం- ఇదీ వరున. దీనిపై అతను కోపంతో చిరచిరలాడుతున్నాడు. అతను ఆ ఈగను అంతమొందించాలని అనుకున్నాడు. కాని నిండు దర్బారులో అలా చేయడం భావ్యం కాదని భావించాడు. తరువాత అతను ఓ ఆలిమ్‌తో సంప్రదించాడు:

"గురువుగారూ! అసలు దైవం ఈగను ఎందుకు సృష్టించినట్లో, కొంచెం వివరంగా చెప్తారా?"

"పొగరుబోతు పొగరును మట్టిలో కలపడానికి" ఆ ఆలిమ్ అన్నారు. ఈ చేదు నిజాన్ని విని మన్సూర్ ఊరకుండిపొయ్యాడు.

మీరు ఈపాటికి గ్రహించే ఉంటారు- ఈ ఆలిమ్ ఎవరయిందీను. ఈయనే మనందరి ఆదర్శనీయులయిన పెద్ద ఇమామ్ జాఫర్ సాదిఖ్ (రహ్మాలై). ఈయన ప్రియప్రవక్త (సఅసం) అల్లుడయిన హజ్రత్ అలీ (రజి)గారి మనుమడు.

ఈయన్ని ప్రజలు సాదిఖ్ అని పిలిచేవారు. సాదిఖ్ అంటే సత్యసంధుడు అని అర్థం. ఈయన ఎవరి ముందయినా సరే నిజం చెప్పడానికి ఏ మాత్రం వెనుకాడేవారు కాదు. ఆయనకు దైవభీతి తప్ప మరే భయమూ లేదు. ఆ కాలంలో ఆయన ఎన్నదగ్గ ఆలిమ్ (ధర్మవేత్త)గా పరిగణించబడేవారు. ఖుర్ఆన్, హదీసుల జ్ఞానంలో ఆయన దిట్ట. ఈ జ్ఞానాన్ని ఆయన ప్రియప్రవక్త (సఅసం) అనుయాయులయిన సహాబీల (రజి) వద్ద ఆర్జించారు. ఆయన ఇతరులకు కూడా ఖుర్ఆన్, హదీసుల్ని బోధించేవారు. ఆయన శిష్యుల్లో కూడా అనేక మంది ప్రసిద్ధి చెందారు. హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మలై), హజ్రత్ ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై), హజ్రత్ ఇమామ్ సుఫియాన్ సూరి (రహ్మలై)లే గాక ఇంకా ఇలాంటి గొప్ప ఇమామ్లు, ధర్మవేత్తలు ఈయన శిష్యగణంలో చేరివున్నారు.

ఆయనపై దైవ కారుణ్యం కురవాలని, ఆయన చెప్పిన మాటలను వినడమేకాక, ఆయన చూపిన బాటపై నడిచే సద్బుద్ధిని కూడా దైవం మనకు ప్రసాదించాలని వేడుకుందాం. (ఆమీన్).

# హజ్రత్ ఆమిర్ బిన్ షుర్జీల్ (రహ్మలై)

అబ్దుల్ మలిక్ అనే గొప్ప పేరు ప్రఖ్యాతులు గాంచిన ఖలీఫా ఉండేవాడు. అతను గొప్ప ఆలిమ్ (పండితుడు) కూడా. హజ్జాజ్ లాంటి దుర్మార్గుడికి పోషకుడు కాకుండినట్లయితే అతన్ని మనం మన గౌరవనీయులయిన పెద్దల్లో ఒకడిగా ఎంచేవారం. ఎందుకంటే, అతను జ్ఞానంతోపాటు అపారమయిన తెలివితేటలు కూడా కలవాడు. అతని తెలివితేటలను గురించి ఒక ఆసక్తికరమయిన సంఘటనను వినండి.

ఒకసారి ఖలీఫా అబ్దుల్ మలిక్ ఒక ఆలిమ్‌ను రోమ్ చక్రవర్తి వద్దకు పంపాడు. ఆలిమ్‌గారు చక్రవర్తిని కలుసుకుని మాట్లాడారు. ఆ చక్రవర్తి ఈయన్ని ఎన్నో ప్రశ్నలడిగాడు. ఎటువంటి ప్రశ్నలడిగాడంటే ఇంకొకరైతే సమాధానం చెప్పలేకపోయేవారే. అయితే ఈ ఆలిమ్‌గారు ఎంతో నేర్పుతోఅన్ని ప్రశ్నలకు ఓపికగా సమాధానం ఇచ్చారు. ఆలిమ్‌గారి మాటలు విన్న చక్రవర్తి ఆశ్చర్యచకితుడయిపోయాడు. "మీరు ఉన్నత వంశానికి చెందినవారా" అని చక్రవర్తి అడిగాడు. "లేదు, ఇతర ముస్లిమ్‌లలానే నేను కూడా ఓ మామూలు మనిషినే" అని అన్నారు ఆలిమ్‌గారు.

ఇది విన్న చక్రవర్తి ఎవరూ వినకుండా మెల్లిగా ఏదో అన్నాడు. తరువాత ఓ ఉత్తరం వ్రాసి దాన్ని కవర్‌లో పెట్టాడు. దాన్ని ఆలిమ్‌గారి చేతికిస్తూ, "దీన్ని మీ ఖలీఫాకు ఇవ్వాల"ని అన్నాడు.

ఆలిమ్‌గారు తిరిగివచ్చి ఆ కవర్‌ను ఖలీఫా అబ్దుల్ మలిక్‌కు ఇచ్చారు. దాన్ని చదివిన తరువాత ఖలీఫా ఇలా అన్నాడు: "మీకూ, చక్రవర్తికి మధ్య ఇంకా వేరే ఏదయినా సంభాషణ జరిగిందా?" అప్పుడు ఆలిమ్‌గారు జరిగిన వృత్తాంతం అంతా పూసగుచ్చినట్లు చెప్పారు. ఖలీఫా ఆలిమ్‌గారికి ఆ ఉత్తరాన్నిచ్చి చదవండని అన్నాడు. ఆలిమ్‌గారు దాన్ని చదివారు. అందులో ఇలా వ్రాసి ఉంది: "ఒక జాతిలో ఇలాంటి వ్యక్తి ఉన్నప్పటికీ, అతడ్ని కాదని ప్రజలు ఇంకొకరిని తమ చక్రవర్తిగా ఎన్నుకోవడం ఆశ్చర్యంగా ఉంది."

ఇది చదివిన ఆలిమ్‌గారు, "ఖలీఫా అబ్దుల్ మలిక్ తనను హత్య చేయించడుగదా" అని మనసులో అనుకుని ఖలీఫాతో ఈ విధంగా అన్నారు: "ఓ ఖలీఫా! రోమ్ చక్రవర్తి మిమ్మల్ని చూసివుండినట్లయితే ఈ విధంగా వ్రాసేవాడు కాదు, ఒకవేళ ఈ ఉత్తరాన్ని నేను చదివినా దీన్ని మీ వరకు తెచ్చేవాణ్ణికాదు."

ఆపై ఖలీఫా అన్నాడు: "భవిష్యత్తులో నా ప్రజలు మీరంటే ఇష్టపడి నాకు వ్యతిరేకంగా ఉద్యమించి మిమ్మల్ని తమ ఖలీఫాగా చేసుకుంటారని, అందువల్ల మిమ్మల్ని హతమార్చమని ఆ చక్రవర్తి నాకు సూచనప్రాయంగా అలా వ్రాసి వుంటాడు."

ఖలీఫా దర్బారులో ఉన్న రోమ్ చక్రవర్తి మనుషులు పై మాటలను విని వాటిని తమ చక్రవర్తికి వ్రాసి పంపారు. దానిపై ఆ చక్రవర్తి "అవును, సరిగ్గా నా ఉద్దేశ్యం ఇదే" అని అన్నాడు.

ఈ ఆలిమ్ మహనీయులు ఎవరో ఇక వినండి. ఈయన పేరే హజ్రత్ ఆమిర్ బిన్ షుర్జీల్ షుఐబీ (రహ్మలై). ఈయన ఇమామ్ షుఐబీగా ప్రసిద్ధిచెందారు. ప్రియప్రవక్త (సఅసం) అనుంగు శిష్యులకు ప్రియమయిన శిష్యులు. ఈయన ఐదు వందల మంది సహాబీల దగ్గర ధార్మిక విద్యను అభ్యసించారు. హదీసుల్ని, ఇంకా ఇతర ప్రతి ధార్మిక విషయాన్ని నేర్చుకున్నారు. జ్ఞానార్జనకై సుదూర ప్రదేశాలకు వెళ్ళేవారు. ఎక్కడయినా ఓ సహాబీ (రజి) ఉన్నారని తెలిస్తేచాలు, వెంటనే అక్కడికి వెళ్ళేవారు. ఆ కాలంలో అందరికంటే గొప్ప హదీసు స్మర్త (కంఠస్థం చేసినవారు)గా ఖ్యాతిచెందిన ఇమామ్ హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) వద్ద ఆయన ఒక సంవత్సరంపాటు శిష్యరికం చేశారు.

ఇది జ్ఞానార్జనకై ఆయన పడిన శ్రమకు సంబంధించిన విషయం. దైవం తన అనుగ్రహంతో ఆయనకు మంచి వివేచనా శక్తిని, చక్కగా మాట్లాడే తీరుని కూడా ప్రసాదించాడు. ఆయన ప్రతి విషయాన్ని ఎంతో చక్కగా విడమరచి చెప్పేవారు. కాబట్టే అందరూ దాన్ని అర్థం చేసుకుని వారి వివేచనా శక్తి పట్ల, సామర్థ్యం పట్ల ఎంతో ఆశ్చర్యపడేవారు. ఈయన వివేచనా శక్తి కారణంగానే ఆనాటి ఖలీఫా అబ్దుల్ మలిక్ ఆయన్నెంతో గౌరవించేవాడు. హజ్జాజ్ వంటి

పరమ దుర్మార్గుడు కూడా ఈయన తెలివితేటలకు మెచ్చి ఈయన్ని గౌరవించేవాడు.

ఖలీఫా అబ్దుల్ మలిక్ ఇతర చక్రవర్తులతో ఏదయినా వ్యవహారం చేయదల్చుకుంటే ఇమామ్ షుఐబీ (రహ్మాలై)ని పంపేవాడు. దానికి తగ్గట్టుగానే ఆయన ఆ వ్యవహారాన్ని ఎంతో చక్కగా నెరవేర్చి వచ్చేవారు. ఈయన బోధ వినే హజ్రత్ ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) విద్యపై దృష్టిని సారించి గొప్ప ఆలిమ్ అయ్యారు. ఫలితంగా ఆయన ఫిఖా (ధర్మశాస్త్రం)లో గొప్ప పండితునిగా ప్రసిద్ధిచెందారు. వీరిపై దేవుని అనుగ్రహం కలుగుగాక! దైవం మనకు కూడా అలాంటి వివేచనా శక్తిని ప్రసాదించుగాక! (ఆమీన్).

# హజ్రత్ రబియా (రహ్మాలై)

పవిత్ర మదీన్నాలో ఓ మహనీయుడుండేవారు. ఆయన పేరు అబూ అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్. ఆయన ఓ వీర సైనికుడు. ఆయనకు ధర్మయుద్ధం (జిహాద్) పట్ల ఎంతో మక్కువ ఉండేది. ఒకసారి ఆయన ఓ ధర్మపోరాటంలో పాల్గొనేందుకై వెళ్ళి 27 సంవత్సరాల తర్వాత ఇంటికి తిరిగివచ్చారు. వెళ్ళేటప్పుడు తన సతీమణికి 30 వేల దీనార్‌లను ఇచ్చి వెళ్ళారు. ఆయన వెళ్ళిన రెండు మూడు నెలల తరువాత వారికి ఓ పిల్లవాడు జన్మించాడు.

అబూ అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్ సతీమణి ఎంతో వివేకవంతురాలు. ఆమె పిల్లవాణ్ణి ఎంతో చక్కగా పెంచి పోషించారు. ఎల్లప్పుడూ ఆ బాలుణ్ణి పరిశుభ్రంగా ఉంచేవారు. వేళకు తినిపించి, నిద్రపుచ్చెడివారు. ఇంకా బాల్యం నుండే పిల్లవాడికి నమాజ్ పట్ల శ్రద్ధ చూపే అలవాటు చేశారు. పిల్లవానికి మాటలు వచ్చిన తరువాత కలిమా (సద్వచనాన్ని), నమాజ్‌ను నేర్పడమేగాక పిల్లవాడి

విద్యాభ్యాసానికై కూడా తగు ఏర్పాటు చేయించారు ఆమె. విద్యనభ్యసించడానికై తన కుమారుడ్ని పెద్ద పేరు మోసిన గురువుల వద్దకు పంపేవారు.

ఆ కాలంలో ప్రియప్రవక్త (సఅసం) అనుచరగణం (సహాబా(రజి)) వద్ద ఖుర్‌ఆన్, హదీసుల విద్యను అభ్యసించినవారు అనేక మంది ఉండేవారు. దైవానుగ్రహం వలన పిల్లవాడు కూడా ఎంతో బుద్ధిమంతుడు. ఎల్లప్పుడూ తల్లి మాట వింటూ, శ్రద్ధతో చదువుతూ విషయాల్ని గుర్తుంచుకునేవాడు. కొద్ది రోజుల్లోనే ఖుర్‌ఆన్ పారాయణాన్ని పూర్తి చేశాడు. హదీసు జ్ఞానాన్ని కూడా అభ్యసించి, ప్రియప్రవక్త (సఅసం) ఏ విధంగా ప్రతి పనిని చేసేవారో అన్న విషయాన్ని కూడా తెలుసుకున్నాడు. 27 సంవత్సరాల వయసులో తన సమకాలీన విద్వాంసుల్లోకెల్లా మిన్నగా తయారయ్యారు. ప్రజలందరూ ఆయన్ని గౌరవించడం మొదలెట్టారు. హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మలై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) వంటి పెద్ద పెద్ద ఇమామ్‌లు (నాయకులు) కూడా వీరి శిష్యగణంలోనివారే.

ఉత్తముడు, వివేచనాపరుడు, పండితుడు, ధర్మవేత్త అయిన ఈ యువకుడు మదీనాలో పెద్ద పెద్ద వృద్ధులక్కూడా గురువుగా తయారయ్యాడు. ధర్మపోరాటాని(జిహాద్)కై వెళ్ళిన అబూ అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్ 27 సంవత్సరాలకు తిరిగివచ్చారు. ఆయన ఇప్పుడు ముసలివారయ్యారు. ఇంటి గుమ్మం వద్దకు వచ్చి తలుపుతట్టారు. ఆ వేళ ఇంట్లో ఉన్న ఆలిమ్, ఫాజిల్ అయిన తన యువ కుమారుడు ఉన్నాడు. తలుపు తట్టిన శబ్దానికి బయటికి వచ్చాడు ఆ యువకుడు. అయితే అబూ అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్ తన కుమారుణ్ణి ఎలా గుర్తుపట్టగలరు? తను వెళ్ళిన రెండు మూడు నెలలకు అతను జన్మించాడు. పైగా ఇంతకు ముందెప్పుడూ చూడలేదాయె. తన ఇంట్లోంచి బయటికొచ్చిన ఆ యువకుణ్ణి చూసి ఆగ్రహం చెందారు ఆయన. చేయి పట్టి, "నీవెవరవు, నా ఇంట్లో తిష్ఠవేసి

కూర్చున్నావు?'' అని నిలదీస్తూ ఇంట్లో ప్రవేశించబోయారు అబూ అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్. అప్పుడు ఆ యువకుడు తండ్రి ప్రవేశాన్ని అడ్డుకుంటూ, "అసలు నీవెవరవు? నన్ను దబాయిస్తూ నా ఇంట్లో దూరుతున్నావు?'' అని అన్నాడు.

ఇక చూడండి, ఈ కథ ఎలా మలుపు తిరుగుతుందో. తనయుడు తండ్రిని ఇంట్లోకి ప్రవేశించనీయకుండా అడ్డుకుంటూ, "ఓ పెద్ద మనిషీ! నీకేమైనా మతిబోయిందా? పరాయి ఇంట్లోదౌర్జన్యంగాదూరబోతున్నావు?'' అని అంటున్నాడు. అందుకు తండ్రి, "అసలు నీవెవరివి? నా ఇంటిని ఆక్రమించి కూర్చున్నావు? పద, నిన్ను ఖాజీ (న్యాయాధికారి) వద్దకు తీసుకెళ్ళి, దావా వేసి, నీవు జైల్లోనే మ్రగ్గేటట్లు చేస్తాను'' అని అంటున్నాడు.

ఇద్దరి మధ్య తగాదా పెరిగిపోవడం వలన చుట్టుప్రక్కల జనం ప్రోగయ్యారు. హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మాలై) కూడా ఇది విని పరుగెత్తుకుంటూ వచ్చారు. ఇంకా తనతోపాటు అనేక మంది ఆలిమ్, ఫాజిల్‌లు కూడా గుమికూడారు. తమ గురువు వైపు కొమ్ముకాచి నిలబడ్డారు. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) కల్పించుకుని, "అయ్యా! మీకు ఇంటి అవసరం ఉన్నట్లయితే వేరే ఇల్లు చూసుకోవచ్చుగా, ఇదేంటి? ఇతరుల ఇంటిని ఆక్రమిస్తానని కూర్చున్నారు, ఇదేం బాగాలేదు'' అని ఫరూఖ్ గారితో అన్నారు. "వహ్వా! ఇది మరీ బాగుంది. ఈ ఇల్లు నాదేనండి బాబూ! నా పేరు అబూ అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్. ఈ ఇంటి యజమానిని'' అన్నారు ఫరూఖ్.

ఇంట్లో నుండే ఈ గొడవనంతా వింటున్నారు అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్‌గారి సతీమణి. అయితే అబూ అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్ అనే పేరు వినగానే ఆమె బిరబిరా బయటికి వచ్చేశారు. ఆమె ఫరూఖ్‌గారిని ఆపాదమస్తకం పరికించి, గుర్తుపట్టి, "ఈయన మావారేనండి. ఈయనే అబూ అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్ ' అని అన్నారు. ఆ తరువాత తనయునితో, "వీరే బాబూ! మీ నాన్నగారు'' అని చెప్పారు.

ఇంకేముంది అక్కడున్నవారంతా ఇది విని ఆనందభరితులయ్యారు. సంతోషంతో  ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళిపోయారు. తండ్రి కొడుకుని కౌగలించుకున్నాడు. కొడుకు తండ్రిని కూర్చోబెట్టి కుశల ప్రశ్నలతో ఎంతో గౌరవాన్ని చూపడం మొదలెట్టాడు. ఆ తరువాత ఫరూఖ్ భోజనం చేసి, బాగా అలసివుండటం వలన వెంటనే నిద్రపోయారు. మెలకువ వచ్చిన తరువాత సతీమణితో, "నేను జిహాద్‌కు వెళ్ళేటప్పుడు నీకు 30 వేల దీనార్‌లను ఇచ్చి వెళ్ళాను కదా, మరి అవి ఉన్నాయా? లేక ఖర్చు చేశావా?" అని అడిగారు. అందుకు సమాధానంగా సతీమణి, "గాభరా పడకండి. నేను వాటిని ఓ మంచి పని కోసం ఖర్చుపెట్టాను" అని అన్నారు. "ఏ పని  కోసం ?" అని మళ్ళీ ఫరూఖ్ ప్రశ్నించారు. "నమాజ్ వేళ అయింది. ముందు మీరు నమాజ్ చేసి రండి, ఆ తరువాత చెబుతాను" అని ఆయన సతీమణి అన్నారు.

ఫరూఖ్‌గారు మస్జిద్‌కు వెళ్ళి నమాజ్ చేశారు. నమాజ్ అయిన తరువాత జనమంతా ఎంతో వినయవిధేయతలతో ఓ ప్రక్కకుచేరి కూర్చున్నారు. ఫరూఖ్ సాహెబ్ కూడా అలానే కూర్చున్నారు. ఇక ఖుర్‌ఆన్, హదీసు పాఠం మొదలయింది. ఆ పాఠాన్ని బోధిస్తుంది మరెవరో కాదు, యుక్త వయస్సులోనే ఆలిమ్, ఫాజిల్ అయిన తన తనయుడే. శ్రోతలలో ఉన్నదెవరయ్యా అంటే, హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మాలై), హజ్రత్ హసన్ బిన్ రీద్ (రహ్మాలై), ఇబ్నె అబీ అలీ(రహ్మాలై) ఇంకా ఇలాంటి ఎంతో మంది గొప్పవారు కూడాఉన్నారు. ఫరూఖ్ సాహెబ్ తలవంచి ఎంతో శ్రద్ధతో ఖుర్‌ఆన్ పాఠాన్ని వింటూ, "దైవం ఇంత చిన్న వయస్సులోనే ఈ పిల్లవానికి ఎంతటి జ్ఞానాన్ని ప్రసాదించాడు! పైగా పెద్ద పెద్ద మహాశయులు కూడా హాజరై వింటున్నారాయె!!" అని మనస్సులో ఆశ్చర్యం చెందడం మొదలెట్టారు.

పాఠం (దర్స్) చెప్పేటప్పుడు ఓ శిష్యుడు లేచి గురువును ప్రశ్నించగా అందరూ యుక్తవయస్కుడయిన గురువు వంకే చూడటం మొదలెట్టారు. అప్పుడు ఫరూఖ్ సాహెబ్ కూడా అతని వంక చూసి ఆ యువకుణ్ణి తన కుమారునిగా భావించారు. మళ్ళీ కొంచెం సేపు ఆలోచించి, "ఎంత పొరబడ్డాను, ఇతన్ని నా కుమారునిగా భావించాను. అసలు నా కొడుకు ఏం చదువుకున్నాడో ఏమో" అని మనసులో అనుకున్నారు. ఉండబట్టలేక పక్కనున్నవారిని ఆ యువకుడు ఎవరని అడిగారు. ఆ యువకుని పేరు "రబియా బిన్ అబీ అబ్దుర్రహ్మాన్ ఫరూఖ్" అని తెలుసుకున్నారు.

ఫరూఖ్ సాహెబ్ సంతోషంతో, "అంటే ఇతను నా కుమారుడే అన్నమాట. దేవుడు ఎంతటి అనుగ్రహం చూపాడు నాపై. ఆయన నా కుమారునికి ఎంతటి ఉన్నత స్థానాన్ని ప్రసాదించాడు" అని అనుకుంటూ ఇంటికి వచ్చేశారు. తన సతీమణితో, "మన అబ్బాయిని ఎంతటి గౌరవోన్నతుల స్థానంలో ఉండటాన్ని చూశానంటే, ఆ స్థానంలో మరే గొప్ప ఆలిమ్‌ని కూడా చూడలేకపోయాను" అని అన్నారు.

అప్పుడు ఆయన సతీమణి, "ఇప్పుడు చెప్పండి, మీకు ఆ 30 వేల దీనార్‌లు ఎక్కువా? లేక ఈ గౌరవమా? నేను ఆ దీనార్‌లన్నింటినీ మన అబ్బాయికి లభించిన ఈ గౌరవ స్థానం కొరకే ఖర్చు చేశాను" అని అన్నారు. "దైవసాక్షి! నా కొడుకు ధర్మమార్గంలో ఇంతటి ఆలిమ్ కావటమే నాకిష్టం, నీవు ఆ మొత్తాన్ని (దీనార్‌లను) సరిఅయిన మార్గంలోనే ఖర్చుచేశావు" ఫరూఖ్ అన్నారు.

మీరు ఆసక్తిదాయకంగా ఉన్న ఈ గాథను చదివారు కదూ? ఈ గాథలో హజ్రత్ రబియా (రహ్మాలై) అనే పేరు వచ్చింది. మీరీపాటికి గ్రహించేవుంటారు-

ప్రఖ్యాతిగాంచిన మన పెద్దలలోని హజ్రత్ రబియా (రహ్మలై) వీరేనని. ఇప్పుడు ఆయన్ని గురించిన మిగతా గాధ కూడా వినండి.

హజ్రత్ రబియా (రహ్మలై) కాలంలో అబుల్ అబ్బాస్ సప్ఫా అనే ఓ గొప్ప రాజు ఉండేవాడు. అతను హజ్రత్ రబియా (రహ్మలై) పాండిత్యాన్ని గురించి విని ఏదో ఓ వంకతో పిలవనంపించి తన రాజ్యానికి ప్రధాన న్యాయ మూర్తిగా వ్యవహరించమని కోరాడు. అయితే హజ్రత్ రబియా (రహ్మలై) సప్ఫాలోని కొన్ని దుర్గుణాల కారణంగా ఆ పదవి చేపట్టడానికి నిరాకరించారు. ఆ రాజు వీరికి వేలు, లక్షల రూపాయల డబ్బు ఆశను చూపించాడు. అయినా రబియా (రహ్మలై) అంగీకరించలేదు. దైవం ఆయనకు ఎంతో సంపదను కూడా ప్రసాదించాడు. ఆ మొత్తాన్ని ఆయన తన శిష్యుల కోసం ఖర్చు చేశారు. ఎంత చేతికొస్తే అంత తీసి శిష్యులకు ఇచ్చేవారు. శిష్యులు ఏ చీకూ చింత లేకుండా ధార్మిక విద్యను అభ్యసించాలన్న ఉద్దేశ్యంతోనే ఆయనిలా ఉదారంగా ఖర్చు చేసేవారు. శిష్యులకు సహాయం చేయడమేగాక, ఇతరులకు కూడా దానధర్మాలు చేసేవారు. ఈ విధంగా దానం చేయడం మూలాన ఒక్కోసారి ఆయన అప్పుల పాలయ్యేవారు.

హజ్రత్ రబియా (రహ్మలై)లో ఇంకా ఇలాంటి ఎన్నో సద్గుణాలుండటం మూలానే నేటికీ ముస్లిములు ఆయన్ని తమ పెద్దలుగా, మహనీయులుగా గౌరవిస్తున్నారు. మరో రకంగా చెప్పాలంటే, ఇలాంటివారినే ఖుర్‌ఆన్ సజ్జనులుగా పేర్కొంటుంది. ఖుర్‌ఆన్‌లో ఇలా వివరించబడింది: "ఎవరయితే అందరి కన్నా ఎక్కువ దైవభీతి కలిగి (చెడులకు దూరంగా) ఉంటాడో, అతనే దేవుని దృష్టిలో సజ్జనుడు." హజ్రత్ రబియా (రహ్మలై) కూడా ఇలాంటి కోవకే చెందినవారు. దైవం వీరిపై తన కారుణ్యానుగ్రహాల్ని కురిపించుగాక!

# హజ్రత్ అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మలై)

మన దేశానికి వాయువ్య మూలన ఈరాన్ అనే ఓ దేశం కలదు. ఆ దేశంలో 'ఖురాసాన్' అనే రాష్ట్రం ఉంది. అందులో 'మరూ' అనే ఓ ప్రాంతం ఉంది. ఆ ప్రాంతంల్లోనే 'బనూహన్జలా' అనే ఓ తెగ ఉంది. ఆ తెగకు ఓ తోట కలదు. ఆ తోటకు మాలిగా ఒక బానిస ఉండేవాడు. అతని పేరు ముబారక్.

ముబారక్ బానిస అయినప్పటికీ ఎంతో మంచి మనిషి. అతను నమాజ్ చేస్తూ ధర్మపరాయణతతో మెలిగేవాడు. చెడుకు ఎంతో దూరంగా మసలుకునేవాడు. ఎల్లప్పుడూ సత్యాన్నే పలికేవాడు. చాలా నిజాయితీపరుడు. అతని నిజాయితీ విషయంలో ఓ సంఘటనను వినండి. మీకూ ఇలాంటి సందర్భం ఎదురైతే ముబారక్‌లాగా ప్రవర్తించడం మరచిపోకండి.

అసలు జరిగిందేమంటే, అతను మాలిగా పనిచేసే తోట యజమాని ఓ రోజు తనకు ఓ పుల్లని దానిమ్మ పండు తెచ్చివ్వమని ముబారక్‌ను ఆజ్ఞాపించాడు. ముబారక్ తోటలోకి వెళ్ళి ఓ దానిమ్మ పండును తెచ్చి ఇచ్చాడు. తిని చూస్తే అది తియ్యగా ఉంది. దానిపై యజమానికి కోపం వచ్చి నీవు ఇన్ని రోజుల నుండి ఈ తోటకు మాలిగా పనిచేస్తున్నా, ఇంకా నీకు తీపికి, పులుపుకు తేడా తెలియకపోయిందా? అని గద్దించాడు.

"అవును దొరా! ఏ పండు తియ్యనిదో, మరేది పుల్లనిదో నాకయితే తెలియద"ని ముబారక్ అన్నాడు. "ఏమిటీ!? ఇన్నాళ్ళ నుంచీ నీవీ తోటలోఒక్క పండును కూడా తినలేదా?" అని యజమాని ప్రశ్నించాడు. "తినలేదు" అని మాలి సమాధానం పలికాడు. "ఎందుకు?" తిరిగి యజమాని ప్రశ్నించాడు. "మీరు నన్ను ఈ తోటకు కాపలాదారునిగానే ఉంచారుగాని, అందులోని

పండ్లను తినే అనుమతి ఇవ్వలేదు. ఒకవేళ నేను అలా చేస్తే అది దొంగతనమే అవుతుంది తప్ప నిజాయితీ కాద"ని ముబారక్ సమాధానమిచ్చాడు.

ఇది విన్న యజమాని బానిస నిజాయితీ, ధర్మప్రవర్తన పట్ల ఎంతో సంతోషించాడు. ఇంటికి వెళ్ళి తన బానిస విషయాన్ని ఇంట్లోవారందరికీ విన్పించగా అందరూ చాలా సంతోషించారు. ఎందుకంటే, ఆ కుటుంబ సభ్యులు కూడా సజ్జనులు, నిజాయితీపరులే.

ఇంకా వినండి! ఆ యజమానికి ఓ కుమార్తె కలదు. ఆమె కూడా ఎంతో సుగుణవతి. ఆ అమ్మాయికి యుక్తవయస్సు వచ్చింది. ఎవరితో, ఎలా ఆమె వివాహం చేయాలని తోట యజమాని ముబారక్‌ను సలహా అడిగాడు.

ముబారక్‌కు పెళ్ళి విషయం తాలూకు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)గారి ఓ ప్రవచనం గుర్తుండింది. ఆయన (సఅసం) ఆ ప్రవచనంలో ముస్లిములకు హితబోధ చేస్తూ, "పెళ్ళి విషయంలో ఆస్తిపాస్తుల్నిగాని, ఉన్నత వంశాన్నిగాని, ఇంకా అందచందాలనుగాని చూడకండి. వధువు లేక వరుని గుణగణాలు, సద్వర్తనం, దైవం పట్ల భయభక్తులు ఉన్నవా? లేవా? అనే విషయాల్ని మాత్రమే చూడండి" అని అన్నారు. ఈ విషయాల్ని ముబారక్ తన యజమానికి విన్పించాడు.

ఈ మాట తోట యజమానికి, అతని కుటుంబంలోని వారందరికీ ఎంతో నచ్చింది. ఎందుకు నచ్చదు? ప్రవక్త (సఅసం) ప్రవచనాలు ప్రతి ముస్లిమ్‌కు ప్రీతికరమయినవే. యజమానికి ఈ మాట ఎంతో మేలుగా తోచింది కాబట్టి తన కుమార్తెకు ముబారక్ కంటే మంచి వరుడు దొరకడని తన సతీమణితో అన్నాడు. "అవును, ముబారక్ ఎంతో నిజాయితీపరుడు, అల్లాహ్ పట్ల భయభక్తులు కలవాడు; అతను దైవాజ్ఞల ప్రకారం తన సతీమణి పట్ల సద్వర్తనతో మెలగగలడు, మన అమ్మాయి శ్రేయస్సు అందులోనే ఉంది" అని ఆయన సతీమణి కూడా భర్తతో ఏకీభవించింది.

ఈ సంప్రదింపుల తరువాత తోట యజమాని ముబారక్‌తో తన కూతురి వివాహం జరిపించాడు. ముబారక్ తక్కువ వంశస్థుడని, బానిసని, పేదవాడని, పెద్దగా అందమయినవాడు కాదని తోట యజమాని చూడలేదు. అతను కేవలం ముబారక్‌లో ఉన్న సత్యసంధత, నిజాయితీలనే చూశాడు.

ఇక చూడండి, భర్త సత్యవంతుడు, నిజాయితీపరుడు, దానికి తోడు అతని భార్యా సద్వర్తనురాలు, అల్లాహ్ పట్ల భయభక్తులు కలది. ఆ దంపతులకు దేవునికృప వలన ఓ మంచి పిల్లవాడు జన్మించాడు. ఆ బాలుడు పెద్దవాడయి తన కాలంలో అందరికంటే పెద్ద ధర్మవేత్తగా ఖ్యాతి గడించాడు. అతను దైవధర్మా(ఇస్లామ్)న్ని ఉన్నతం చేశాడు. ఆ బాలుని పేరు అబ్దుల్లా. నేడు మనం అదే పేరుని ఎంతో గౌరవంతో హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ముబారక్ అని పిలుచుకుంటున్నాం (వారిపై దేవుని అనుగ్రహం కలుగుగాక!).

హజ్రత్ అబ్దుల్లా హిజ్రీ 118వ సంవత్సరంలో జన్మించారు. ఆ కాలంలో ప్రియప్రవక్త (సఅసం) అనుచరుల (రజి) శిష్యులు అధిక సంఖ్యలో ఉండేవారు. ప్రవక్త అనుచరుల శిష్యులను 'తాబెయీన్' అని అంటారు. వారిలో ఎందరో ధర్మవేత్తలుగా, నాయకులుగా అలరారారు. అంటే, ఖుర్ఆన్, హదీసుల జ్ఞానం ఎంతో ఎక్కువగా తెలిసిన గొప్ప పండితులన్నమాట.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మాలై)కు ఖుర్ఆన్, హదీసు విషయాల జ్ఞాన సముపార్జన పట్ల ఎంతో మక్కువ ఉండేది. దానికితోడు దైవం వారికి మంచి వివేచనా శక్తిని కూడా ప్రసాదించాడు. ప్రతి విషయం వారికి సునాయాసంగా కంఠోపాఠమయ్యేది, ఇక దాన్ని ఎల్లప్పుడూ జ్ఞాపక ముంచుకునేవారు.

ఒకసారి ఆయన ఓ ధర్మవేత్త ప్రసంగాన్ని వినడం జరిగింది. దాన్ని పూర్తిగా కంఠస్థం చేశారు. ప్రజల కోరికపై అదే ప్రసంగాన్ని ఒక్క అక్షరం కూడా

పొల్లుపోకుండా అంతా విన్పించారు. ఇది విన్నవారంతా ఎంతో ఆశ్చర్యం చెందారు. ఇదంతా దేవుని కృప. ఆయన తన కిష్టమయినవారికి గౌరవోన్నతులను ప్రసాదిస్తాడు. హజ్రత్ అబ్దుల్లాపై కూడా దేవుని కృప ఉండబట్టే కొద్ది కాలంలోనే ఆయన గొప్ప విద్వాంసుడవగలిగారు. దూర దూర దేశాలకు వారి పేరు పాకిపోయింది. ప్రజల్లో వారికి మిక్కిలి గౌరవముండేది. హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ముబారక్ (రహ్మాలై) గురువుగారు కూడా తనను ఎంతో గౌరవించేవారు.

హజ్రత్ అబ్దుల్లాగారికి హజ్రత్ సుఫియాన్ సూరి (రహ్మాలై) అనే గురువుగారుండేవారు. ఓ ఖురాసానీయుడు సుఫియాన్ గారిని ఖుర్ఆన్, హదీసులకు సంబంధించిన ఓ మాటను అడిగాడు. అందుకు సుఫియాన్ (రహ్మాలై) గారు, "మీ ఖురాసాన్‌లోనే గొప్ప విద్వాంసుడు ఉండగా ఈ విషయం నన్నడగడానికి వచ్చావా?" అన్నారు. "మా ప్రాంతంలో ఉన్న ఆ గొప్ప విద్వాంసుడు ఎవరు? అతని పేరేమిట"ని మళ్ళీ ఆ మనిషి ప్రశ్నించాడు. "అబ్దుల్లా ఇబ్నె ముబారక్. ఈ రోజుల్లో అతన్ని మించిన (ఆలిమ్) విద్వాంసుడు ఎవరూ లేర"ని సుఫియాన్ (రహ్మాలై) చెప్పారు.

హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మాలై) కూడా అబ్దుల్లా (రహ్మాలై)కు గురువుగారే. ఆయన కూడా అబ్దుల్లాను గొప్ప ఆలిమ్‌గా పరిగణించి గౌరవించేవారు. ఇంకా ప్రజలందరూ వారిని గౌరవించేవారు.

హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ముబారక్ (రహ్మాలై) గారిని ప్రజలు చక్రవర్తి కంటే అధికంగా గౌరవించేవారు. ఓసారి వీరు రఖ్ఖా అనే ఓ పట్టణానికి వెళ్ళారు. ఆ సమయంలో చక్రవర్తి హారూన్ రషీద్ అక్కడే విడిది చేసిఉన్నాడు. చక్రవర్తి తన సతీమణితో ఓ మహల్‌లోని గదిలో కూర్చుని ఉన్నాడు. ఉన్నట్టుండి, అతని

దృష్టి బయటి వీధి వైపు పడింది. జనమంతా ఒకవైపు పరుగెత్తుకుపోవడం చూశాడు. ఎంతసేపటకీ దౌడుతీసే జనం వరుస తెగడం లేదాయె! హారూన్ రషీద్ సతీమణి, 'ఏమిటి? ఈ జన సందోహం, వీళ్ళంతా ఎక్కడికెళుతున్నట్లు' అని అడిగింది. "గొప్ప (ఆలిమ్) విద్వాంసుడు అయిన హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ముబారక్ ఖురాసాన్ నుండి వస్తున్నారు. ఆయన్ని సాదరంగా ఆహ్వానించడానికి ప్రజలంతా పట్నం వెలుపలికి వెళుతున్నారు" అన్న సమాధానం వారికి లభించింది. అప్పుడు చక్రవర్తి సతీమణి, "వాస్తవంగా చెప్పాలంటే చక్రవర్తి అంటే ఈయనే. హారూన్ రషీద్ ఏపాటివారు? పోలీసులు, సిపాయిలు లేనిదే ప్రజల్ని సమీకరించలేరు" అని అన్నది.

హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ముబారక్ (రహ్మాలై) ఎంత గొప్ప విద్వాంసులయినప్పటికీ తన విద్యతో ధనాన్ని కూడబెట్టలేదు. వారు బట్టల వ్యాపారం చేసేవారు. అందులో వారికి ఎక్కువ లాభాలు వచ్చేవి. ఆడబ్బును తన స్వంతానికి కాక నిరుపేదలు, నిస్సహాయులు, అనాథల కొరకు, ఇంకా ఖుర్ఆన్, హదీసు జ్ఞాన సముపార్జనకై కృషి చేసేవారికై ఖర్చు చేసేవారు. విద్యార్థుల దృష్టి అటు ఇటు మరలకుండా చదువుపై లగ్నం కావాలనే ఉద్దేశ్యంతో, వారికి ఆయన ఎంతో ధనాన్ని దానంగా ఇచ్చేవారు.

ఋణగ్రస్తుని ఋణం చెల్లింపులో సహాయపడటం వలన ఎంతో పుణ్యం లభిస్తుంది. ప్రియప్రవక్త (సఅసం) ధనవంతులయిన ముస్లిములకు ఈ విషయంపై తమ దృష్టి సారించమని సెలవిచ్చి ఉన్నారు. హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ముబారక్ (రహ్మాలై) ఋణగ్రస్తుని ఋణాన్ని తన స్వంత డబ్బుతో చెల్లించి ఎంతో సహాయపడేవారు. ఓసారి ఎవరో ఒక వ్యక్తి హజ్రత్ అబ్దుల్లాగారి వద్దకు వచ్చి ఏడు వందల రూపాయల రుణాన్ని చెల్లించడంలో తనకు సహాయం చెయ్యమనంటే, అతనికి వారు ఏడు వేలు ఇచ్చి పంపారు.

అలాగే, ఒకసారి వారి శిష్యుడొకరు అప్పుల్లో చిక్కుకుని దాన్ని తీర్చకపోయేసరికి జైలుకు పంపబడ్డారు. ఇది తెలుసుకున్న హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ముబారక్ (రహ్మాలై) అతన్ని విడిపించడానికి పది వేలు చెల్లించి అక్కణ్ణుంచి కనుమరుగయినారు. చివరికి తన శిష్యుడు తనను ఎవరు విడుదల చేయించారన్న విషయాన్నీ కనుగొనలేకపోయాడు.

వాస్తవం చెప్పాలంటే హజ్రత్ అబ్దుల్లా ఇదంతా పేరు ప్రఖ్యాతుల కోసంగాక, కేవలం దైవప్రసన్నత కోసమే చేసేవారు. అందుకనే వారి పుణ్యకార్యాలు ఎవరికీ తెలిసేవి కావు. అయినా అవి దాగేవి కావు. వారికి జిహాద్ చేయాలని ఎంతగానో కోరికగా ఉండేది. ఒకసారి ఓ జిహాద్ (ధర్మయుద్ధం)లో పాల్గొన్నారు. దైవధిక్కారులతో ఎంతో ధైర్యంతో పోరాడారు. శత్రుసేనలోని ముగ్గురు గొప్ప పహిల్వానుల్ని ఛాలెంజి చేసి మరీ చిత్తు చేశారు. కాని ఆ సమయంలో తనను ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు ముసుగు ధరించారు. చూసేవాళ్ళు ఈ ముసుగు వీరుడు ఎవరబ్బా అని అనుకున్నారు- చివరికి ఓ మనిషి వీరి ముఖంపై ముసుగును తొలగించాడు- ఇంకేముంది అందరూ వీరిని గుర్తుపట్టి ఆశ్చర్యంలో మునిగిపోయారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మాలై)- ఎంత గొప్ప పండితుడు, శూరుడు అంటే, ఆయన్ని ప్రజలంతా గౌరవించేవారు. వారిలో ఏ మాత్రం గర్వం లేదు. ఒకవేళ ఎవరయినా తన్ను గురించి పొగిడారంటే దానిపై ఎంతో కోపగించుకుని, వారు నోరెత్తకుండా వారించేవారు.

ప్రియప్రవక్త (సఅసం) లానే హజ్రత్ అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మాలై) కూడా 63 సంవత్సరాలు జీవించారు. దీనిపై ప్రజలు, "హజ్రత్ అబ్దుల్లా ప్రియప్రవక్త (సఅసం) ప్రవచనాల ప్రతి విషయంలో ఆచరణాత్మక జీవితాన్ని

గడిపారు కాబట్టే, దైవం వారికి వయస్సు కూడా అంతే ఇచ్చాడు" అని చెప్పుకునేవారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మాలై) హిజ్రీ 181 వ సంవత్సరం రమజాన్ నెల 13వ తేదీన దైవసన్నిధికి వెళ్ళిపోయారు. ఈ విషాద వార్త విన్నవారంతా ఎంతో ఆవేదనతో కుమిలిపోయారు.

ఖలీఫా హారూన్ రషీద్ కూడా ఈ వార్త విని, "ఇది చాలా బాధాకరమైన విషయం. పండిత రాజు పరలోకానికి పయనమైపోయారు" అని అన్నారు. వీరి శిష్యగణంలో చాలా మంది ఆలిమ్‌లు, ఇమామ్‌లు తయారయ్యారు. వీరిలో ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై), యహ్యా బిన్ ముఅయిన్ (రహ్మాలై), అబూ బకర్ బిన్ షీబా (రహ్మాలై), హబ్బాన్ బిన్ మూసా (రహ్మాలై), అబ్దుర్రహ్మాన్ బిన్ మెహ్‌ది (రహ్మాలై)లు ఎంతో ప్రఖ్యాతిగాంచారు. దైవం మనకూ వారిలానే మంచి పనులు చేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక! (ఆమీన్).

# హజ్రత్ రబీఅ బిన్ ఖసీమ్ (రహ్మాలై)

ప్రియప్రవక్త (సఅసం) సహాబీ (రజి)ల శిష్య (తాబెయీన్)ల్లో రబీఅ బిన్ ఖసీమ్ అనే మహనీయుడుండేవారు. వారినే మనం హజ్రత్ రబీఅ (రహ్మాలై) అని కూడా అంటాము. వీరు ఎంత సద్గుణ సంపన్నులంటే గౌరవనీయులైన సహాబీ (రజి)లు కూడా వీరిని గురించి, "ప్రియప్రవక్త (సఅసం) గనక ఈయన్ని చూసి ఉన్నట్లయితే ఎంత ప్రేమించేవారో!" అని అనేవారు.

దీన్నిబట్టి హజ్రత్ రబీఅ (రహ్మాలై) ఎంత మంచి మనిషో మనం అర్థం

చేసుకోవచ్చు. వీరు ఎంతో కష్టపడి ఖుర్ఆన్, హదీసులను అభ్యసించారు. వాటి ప్రకారం ఆచరణ కూడా చేసేవారు. దేవుని, దైవప్రవక్త (సఅసం) ఆజ్ఞలకు వ్యతిరేకంగా ఏ పనీ జరక్కుండా ఎంతో జాగ్రత్తపడేవారు. అత్యంత శ్రద్ధతో దైవారాధన చేస్తూ, దైవదాసులకు మనస్ఫూర్తితో తన సేవలందించే వారు. ఇలాంటి సేవలను గురించి గుణపాఠాన్ని గరిపే ఆసక్తికరమయిన ఓ సంఘటనను వ్రాస్తున్నాం. కాస్త మీరూ దీన్ని పఠించండి.

ఒకసారి హజ్రత్ రబీఅ (రహ్మాలై) సతీమణి ఓ మంచి రుచికరమయిన వంట చేసి దాన్ని తినమని ఆయన ముందుంచారు. కాని ఆయన ఘుమఘుమలాడుతున్న ఆ వంటను పొగడుతూ అనేకసార్లు అల్హమ్దు లిల్లాహ్, అల్ హమ్దు లిల్లాహ్ అంటూ దాన్ని పొరుగువారింటికి తీసికెళ్ళారు. అక్కడ ఓ పిచ్చివాడుండేవాడు. తను తీసికెళ్ళిన ఆ వంటను ఆ పిచ్చివాడు తిన్నాక, అతని నోరు, చేతులు శుభ్రం చేసి మరీ తిరిగివచ్చారు హజ్రత్ రబీఅ (రహ్మాలై). అది చూసి తన సతీమణి, "వారెవాహ్! ఇది చాలా బాగుంది!! నేను మీ కోసం ఈ వంట చేస్తే దాన్ని తీసికెళ్ళి ఎవరో పిచ్చివాడికి తిన్పించి వచ్చారే! వాడికి తనేం తిన్నది తనకే తెలియదు" అన్నారు. అందుకు సమాధానంగా హజ్రత్ రబీఅ (రహ్మాలై), "అతనికి తెలియకున్నా దైవానికైతే తెలుసుగా" అన్నారు.

వాహ్ వాహ్! ఎంత మంచి పని చేశారు!! పైగా సమాధానం కూడా ఎలా ఇచ్చారో గమనించారుగా- అంటే దైవానికయితే తెలుసు. పుణ్యం సంపాదించేది ఆయన నుంచే కదా మరి. ఇందులో మన కోసం ఎంత మంచి గుణపాఠం ఉందో మీరే ఆలోచించండి. మనం కూడా దైవానికి ఇష్టమయిన పనులు చేస్తే మనమూ దైవప్రీతికి పాత్రులవుతాం. ముస్లిములకు అన్నింటికంటే విలువయినది దైవప్రీతిబడయటమే కదా. దైవం మనకా సద్బుద్ధిని ప్రసాదించుగాక!

# హజ్రత్ సఫ్వాన్ (రహ్మలై)

ప్రియప్రవక్త (సఅసం) అనుంగు శిష్యులయిన సహాబీల (రజి) శిష్యుల్లో ఓ మహనీయుడుండేవారు. ఆయన పేరు సఫ్వాన్ బిన్ సలీమ్ జుహ్రీ (రహ్మలై). వీరినే మనం సఫ్వాన్ (రహ్మలై) అని అంటాము. వీరు మదీనా నివాసి.

హజ్రత్ సఫ్వాన్ (రహ్మలై) దేవునికి ఎంతో భయపడేవారు. నమాజ్ అంటే వీరికెంతో ఇష్టం, వీరు సదాచార సంపన్నులు. మరచిపోయి కూడా చెడుకు చేరువయ్యేవారు కాదు. ఎలాంటి ప్రలోభానికి వీరు లొంగేవారుకాదు. ఆ కాలంలో పెద్ద పెద్దవారు, చక్రవర్తులు ఆయనకు పెద్ద ఎత్తున డబ్బు, బహుమతులు ఇవ్వజూపేవారు. కాని ఆయన వాటిని స్వీకరించక తన పేదరికం లోనే తృప్తిగా ఉండేవారు. దైవారాధనను ఆయన సకల సంపదల్లో ఉత్తమ మయిన సంపదగా భావించేవారు. ఈ విషయంలో వారి గురించి ఎన్నో ప్రఖ్యాతిగాంచిన గాధలున్నాయి. ఓ ఆసక్తికరమయిన కథ ఇక్కడ తెలుసు కుందాం.

ఆ కాలంలో సులైమాన్ బిన్ అబ్దుల్ మలిక్ అనే ఓ ఖలీఫా ఉండేవాడు. సులైమాన్ తరపున హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) మదీనాలో గవర్నర్‌గా వ్యవహరించేవారు. వీరు (అబ్దుల్ అజీజ్) కూడా ఎంతో దైవభక్తి పరాయణులు. కాబట్టే ఆయన ఎల్లప్పుడూ దైవదాసులతో కలిసిమెలసి ఉండేవారు. అలాగే హజ్రత్ సఫ్వాన్ (రహ్మలై)తో కూడా ఎంతో కలుపుగోలుగా ఉండేవారు.

ఒకసారి ఖలీఫా సులైమాన్ మదీనాకు వచ్చాడు. జుహర్ వేళకు అతను

నమాజ్‌కై మస్జిద్‌లో ప్రవేశించాడు. అప్పుడు హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మాలై) కూడా వెంట ఉన్నారు. మస్జిద్ ఓ మూలలో సఫ్వాన్ (రహ్మాలై) దైవధ్యానంలో మునిగివున్నారు. ఖలీఫా సులైమాన్, హజ్రత్ సఫ్వాన్ (రహ్మాలై) వంక ఎంతోసేపు గమనించిన పిదప హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మాలై)తో, "ఈ మహనీయుడెవరు?- చూడ్డానికి ఎంతో దైవభక్తిపరాయణునిగా కన్పిస్తున్నారు?" అని అడిగాడు. సమాధానంగా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మాలై) అన్నారు, "వీరు సఫ్వాన్ బిన్ సలీమ్ జుహ్‌రీ (రహ్మాలై). నిజంగానే ఈయనెంతో దైవభక్తిపరాయణులయిన మహనీయుడు. ప్రియప్రవక్త (సఅసం) అనుంగు శిష్యుల (రజి) ద్వారా ధార్మిక విద్యను అభ్యసించారు. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), అనస్ బిన్ మాలిక్ (రజి), ఇంకా అనేక మంది సహాబీలు (రజి) ఈయనకు గురువులు, అంతేకాక ఈయన శిష్యులు కూడా గొప్ప గొప్ప పండితులుగా, ధర్మపరాయణులుగా ప్రసిద్ధిచెందారు."

ఖలీఫా సులైమాన్ హజ్రత్ సఫ్వాన్ విషయం విని, ఐదు వందల దీనార్లు (బంగారపు నాణాలు) వారికివ్వమని తన బానిసను ఆజ్ఞాపించాడు. ఆ బానిస డబ్బు సంచిని హజ్రత్ సఫ్వాన్ (రహ్మాలై) ముందుబెట్టి, "ఖలీఫా దీన్ని మీ కొరకు పంపారు. ఆయన (ఖలీఫా) కూడా ఇక్కడే ఉన్నార"ని అన్నాడు.

సఫ్వాన్ (రహ్మాలై) ఆ బానిస వైపు చూసి, "నీవు పొరబడ్డావేమో, దీన్ని ఇంకెవరి కోసమయినా పంపివుండవచ్చు" అని అన్నారు. "లేదు, గురువుగారూ ! దీన్ని మీ కోసమే పంపారు. సఫ్వాన్ అంటే మీరే కదా?" అన్నాడు బానిస. హజ్రత్ సఫ్వాన్, "నా పేరైతే సఫ్వానే.. కాని ఎందుకయినా మంచిది మళ్ళీ వెళ్ళి అడిగిరా, పో" అన్నారు.

అలాగే అడిగివద్దామని ఆ బానిస కొంచెం దూరం వెళ్ళాడో లేదో, హజ్రత్ సఫ్వాన్ (రహ్మాలై) తన చెప్పులు తీసుకుని అక్కడ్నుంచి చల్లగా

జారుకున్నారు. ఖలీఫా సులైమాన్ మస్జిద్‌లో ఉన్నంతసేపు ఆయన మళ్ళీ ఆ దరిదాపులకే రాలేదు. దీనిపై సులైమాన్ అవాక్కయి పోయాడు.

ఎంతటి గొప్ప భక్తిపరాయణులైన మహనీయులు గడిచారు మన పెద్దల్లో!! దైవం మనల్ని కూడా అలానే తయారుచేయుగాక! (ఆమీన్).

# హజ్రత్ అబూ ముహమ్మద్ యహ్యా ఉన్‌దలిస్ (రహ్మాలై)

మన దేశానికి పశ్చిమాన ఓ సముద్రముంది. దాని పేరు అరేబియా సముద్రం. ఆ సముద్రం గుండా నౌకలో ప్రయాణం చేసి ఇంకా ముందుకు సాగినట్లయితే మరో సముద్రానికి చేరుకుంటాం. దాని పేరే ఎర్రసముద్రం. ఈ ఎర్ర సముద్రానికి ఉత్తర దిశగా ప్రయాణిస్తే మనం ఓ రేవుకు చేరుకుంటాం. దాని పేరు "జిద్దా." మన దేశం నుండి హజ్ యాత్ర చేయడానికి వెళ్ళేవారు ఈ జిద్దా రేవులోనే దిగి, అక్కడి నుండి మోటారు వాహనాలపై మక్కా, మదీనాలకు వెళతారు.

జిద్దా నుండి బయలుదేరి రెండు మూడు రోజులు ప్రయాణిస్తే మనం మరో సముద్రానికి చేరుకుంటాం. దాని పేరు మధ్యధరా సముద్రం. అక్కణ్ణుంచి తూర్పు దిశగా ఎనిమిది లేక పది రోజులు ప్రయాణిస్తే "స్పెయిన్" అనే దేశం వస్తుంది. దీన్నే ఉన్‌దలిస్ అని కూడా అంటారు. మన దేశానికి ఇది ఇంచుమించు నాల్గు వేల మైళ్ళ దూరంలో ఉంది, ఈ దేశాన్ని ముస్లిమ్‌లు ఏడు వందల సంవత్సరాలు పాలించారు. ఆ కాలంలో అక్కడ గొప్ప విద్వాంసులు

జన్మించారు. వారిలో ఎక్కువ ప్రసిద్ధి చెందినవారు హజ్రత్ అబూ ముహమ్మద్ యహ్యా ఉన్దలిస్.

హజ్రత్ యహ్యా ఉన్దలిస్ (రహ్మాలై) ఓ బానిస కుమారులు. అయినప్పటికీ ఓ గొప్ప విద్వాంసుడు, దైవభక్తి పరాయణుడూను. అందరికంటే ఎక్కువ దైవభీతి కలిగివుండి, చెడు కార్యాలకు దూరంగా మసలుకునేవాడే దైవభీతి పరాయణుడనబడతాడు.

ఖుర్ఆన్‌లో ఇలా పేర్కొనబడింది: "మీలో అందరిలోకెల్లా ఎక్కువ దైవం పట్ల భయభక్తులు కలవాడే అందరికన్నా ఉత్తముడు, గౌరవ నీయుడు." ఈ కారణంగానే దైవభీతి పరాయణుడయిన వ్యక్తిని ముస్లిములు ఎంతో ఉత్తమునిగా, మహనీయునిగా గౌరవిస్తారు. అంతేగాని ముస్లిములు అతన్ని గురించి అతను బానిసనిగాని, కులీనుడు లేక కులహీనుడనిగాని, పేదవాడా లేక ధనవంతుడా అనిగాని ఆరాతీయరు. వాళ్ళు చూసేదల్లా అతను దైవభీతి పరాయణుడై చెడు పనులకు దూరంగా ఉంటున్నాడా లేదా అనే విషయాన్నే. ఒకవేళ అతను దైవభీతి పరాయణుడని తెలిస్తే అతన్ని ప్రజలు ఎంతో గౌరవిస్తారు.

హజ్రత్ యహ్యా (రహ్మాలై) బానిస కుమారులయినా ఎంతో దైవభీతి పరాయణులయిన మహనీయులు. దానికితోడు ఆయన ఆలిమ్ కూడా. అందువల్లనే ముస్లిములు వారి పట్ల అమితమయిన గౌరవాదరణలు చూపేవారు.

హజ్రత్ యహ్యా (రహ్మాలై) ఖుర్ఆన్, హదీసుల జ్ఞానార్జనకై ఎంతో కష్టపడ్డారు. ఆ కాలంలో నేడున్న రైలు లేక విమానాలు మొదలయిన రవాణా సౌకర్యాలు లేవు. సముద్ర నౌకలు కూడా నేటి మాదిరిగా పటిష్టంగా, సౌకర్య వంతంగా ఉండేవి కావు. ఆ రోజుల్లో నౌకలు సముద్రపు తుఫానుల్లో చిక్కు

కుని మునిగిపోయేవి. ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి చేరేందుకు నెలలు, సంవత్సరాలు పట్టేవి. ఉన్‌దలిస్ నుండి జిద్దాకు నౌక ద్వారా చేరడానికి నేడు ఎనిమిది లేక పది గంటలు పడ్తున్నాయి. అయితే ఇదే హజ్రత్ యహ్యా కాలంలో అనేక నెలలు పట్టేవి. కాలి నడకన బయలుదేరితే కనీసం సంవత్సర కాలం పట్టేది. అలాంటి రోజుల్లో జ్ఞానార్జన కోసం హజ్రత్ యహ్యా (రహ్మాలై) కాలి నడకనే కొన్ని వేల మైళ్ళు ప్రయాణం చేశారు.

ఆ కాలంలో గొప్ప విద్వాంసులు, ధర్మవేత్తలయిన ఇమామ్‌లంతా మక్కా, మదీన, కూఫా, బస్రాలలో ఉండేవారు. మదీనాలోని మస్జిదె నబవీలో ఇమామ్ మాలిక్ (రహ్మాలై) హదీసు విద్యను బోధించేవారు. విద్యాభిలాషతో హజ్రత్ యహ్యా ఉన్‌దలిస్ నుండి బయలుదేరి నెలల తరబడి ప్రయాణించి మక్కాగుండా మదీనాకు చేరుకున్నారు. ఆ సమయంలో వారు పదిహేడు లేక పద్దెనిమిదేళ్ళ వయస్సు గల నవ యువకులు. కొద్ది రోజులు మక్కాలో ఉండి అక్కడి గొప్ప గొప్ప ఇమామ్‌ల వద్ద విద్యనేర్చుకున్నారు. అక్కణ్ణుండి మదీనాకు చేరుకుని ఇమామ్ మాలిక్ (రహ్మాలై) శిష్యరికంలో చేరి, వారి వద్దనే క్రమబద్ధమైన శిక్షణలో హదీసు జ్ఞానాన్ని అభ్యసించడం మొదలెట్టారు.

ఓ రోజు ఇమామ్ మాలిక్ (రహ్మాలై) తన శిష్యులకు బోధ చేస్తున్నప్పుడు బయటి నుండి, "ఏనుగు వచ్చింది, ఏనుగు వచ్చింద"న్న అరుపులు విన్పించాయి. నిజానికి అక్కడ ఏనుగులుండవు. జనమంతా ఏనుగు పేరు విన్నంతనే, దాన్ని చూడడానికి పరుగులు తీస్తూ వీధిన పడ్డారు. ఆ సమయంలో ఇమామ్ మాలిక్ (రహ్మాలై) వద్ద హజ్రత్ యహ్యా (రహ్మాలై) మాత్రమే కూర్చుని ఉన్నారు. దీన్ని గమనించి ఇమామ్ మాలిక్ (రహ్మాలై) "ఉన్‌దలిస్‌లో ఏనుగులుండవుగదా, మరి నీవు ఏనుగును చూడడానికి వెళ్ళలేదేమిటి?" అని

హజ్రత్ యహ్యాని అడిగారు. అప్పుడు యహ్యా, "గురువుగారూ! నేనిక్కడికి వచ్చింది ఖుర్‌ఆన్, హదీసుల జ్ఞానాన్ని సంపాదించటానికేగాని, ఏనుగును చూడడానికి రాలేదు" అని సమాధానమిచ్చారు.

ఈ సమాధానం విని ఇమామ్ మాలిక్ (రహ్మాలై) ఎంతో సంతోషించి, ఆ రోజు నుండి ఆయన్ని ఆఖిల్ (ఎంతో వివేచనాపరుడు) అని పిలిచేవారు.

ఈ విధంగా కష్టించి, శ్రద్ధతో చదువుతున్న వ్యక్తికి దైవం మంచి తెలివితేటల్ని కూడా ప్రసాదిస్తే ఇక ఆ మనిషి ఎంతటి గొప్ప ఆలిమ్ కాగలడో మీరే ఆలోచించండి- శ్రమ, ఆసక్తి, ఇంకా దైవానుగ్రహంతో హజ్రత్ యహ్యా కొద్ది రోజుల్లోనే అత్యంత గొప్ప ఆలిమ్ కాగలిగారు. విద్య నేర్చుకుని ఆయన ఉన్‌దలిస్ చేరుకోకముందే ఆయన విద్యాజ్ఞానాల కీర్తి అక్కడికి చేరి ప్రజల్లో కలకలం రేపింది, అక్కడి ప్రజలు వారిని తమ భుజాలపై ఎత్తుకుని, వారి వద్ద విద్య నభ్యసించడానికై విరుచుకుపడ్డారు. హజ్రత్ యహ్యా (రహ్మాలై) ఉన్‌దలిస్‌లో ఖుర్‌ఆన్; హదీసుల జ్ఞానాన్ని ఎంతో వ్యాప్తి చేశారు.

ఆ కాలంలో ఉన్‌దలిస్‌లో అమీర్ అబ్దుర్రహ్మాన్ బిన్ అల్ హకీమ్ అనే రాజు ఉండేవాడు. ఆయన పండితులను ఎంతో గౌరవించేవాడు. అమీర్ అబ్దుర్రహ్మాన్, హజ్రత్ యహ్యా (రహ్మాలై) పేరు విని వారిని పిలువనంపి ఎంతో సత్కరించాడు, ఇంకా తన దేశానికి ప్రధాన ఖాజీ (న్యాయమూర్తి)గా ఉండమని కోరాడు. కాని హజ్రత్ యహ్యా (రహ్మాలై) అందుకు అంగీకరించలేదు. "నేను ఖుర్‌ఆన్, హదీసుల జ్ఞానాన్ని ఆర్జించింది ఒకరి కింద నౌకరుగా ఉంటూ డబ్బు గడించడానికి కాదు. ఉన్‌దలిస్‌లో ఈ జ్ఞానజ్యోతిని వ్యాపింపజేస్తూ ప్రజలకు దైవాదేశాలు, ప్రవక్త (సఅసం) ఆదేశాలేమిటో తెలియజేయాలన్నదే నా ఉద్దేశ్యం" అని అన్నారు ఆయన.

ఈ సమాధానం విని అమీర్ అబ్దుర్రహ్మాన్ ఏ మాత్రం కోపగించుకోలేదు. పైగా ఆయన దృష్టిలో యహ్యా (రహ్మాలై) గౌరవం ఇంకా పెరిగిపోయింది. ఇతరులు కూడా ఆయన పట్ల అధిక గౌరవం చూపడం మొదలెట్టారు. దీనికితోడు హజ్రత్ యహ్యా (రహ్మాలై) తను అభ్యసించిన దాని ప్రకారం ఆచరణ కూడా చేసేవారు. అంటే ఖుర్ఆన్, హదీసుల్లో ఏ పనుల ఆదేశమయితే ఇవ్వబడిందో వాటిని పాటించేవారు, వేటినయితే విడనాడమని ఉందో వాటిని విడనాడి ప్రియప్రవక్త (సఅసం)కు పూర్తిగా విధేయులయి నడుచు కునేవారు. ఆచరణ అని దీన్నే అంటారు మరి.

హజ్రత్ యహ్యా (రహ్మాలై) వద్ద జ్ఞానమూ ఉంది, దానికితోడు ఆచరణా ఉంది. ఇస్లామ్‌లో ఇలాంటి ఆలిమ్‌లకే ఆదరణ ఉంది. ఇటువంటి ఆలిమ్‌లు దైవానికి తప్ప ఇంకెవరికీ భయపడరు. రాజు ఆదేశించినా సరే, ఇలాంటివారు దైవాదేశాలకు వ్యతిరేకంగా ఒక్కమాట కూడా అనరు. హజ్రత్ యహ్యా (రహ్మాలై) అయితే రాజుని సయితం తీవ్రంగా విమర్శించేవారు.

ఒకసారి ఏమయిందంటే, అమీర్ అబ్దుర్రహ్మాన్ రమజాన్ మాసంలో అతిఘోరంగా మధ్యలోనే ఉపవాస వ్రతాన్ని వదలిపెట్టారు. అలా చేసినందుకు కఫ్ఫారా (పరిహారం) చెల్లించవలసి ఉంది. ఈ విధంగా రోజా మధ్యలోనే విడచిపెట్టినవారు పాప పరిహారంగా ఓ బానిసనయినా విడుదల చేయించాలి, లేదా అరవై మంది నిరుపేదలకు అన్నదానమన్నా చేయాలి, లేదా ఎడతెగకుండా రెండు నెలలు రోజాను పాటించాలి.

అమీర్ అబ్దుర్రహ్మాన్ తన రోజా విరమణ పట్ల ఎంతో పశ్చాత్తాపపడ్డాడు. దీనిపై అతను ఆలిమ్‌లను పిలిపించి, ఏం చేస్తే తన తప్పును దైవం మన్నిస్తాడని సలహా అడిగాడు. అందరికంటే ముందు యహ్యా (రహ్మాలై)నే అడిగాడు.

దానికి సమాధానంగా ఆయన (రహ్మాలై), "ఎడతెగకుండా రెండు నెలలు రోజాను పాటించమ"ని అన్నారు. ఇది విన్న తతిమ్మా ఆలిమ్‌లు అక్కడ ఏమీ మాట్లాడలేదు, కాని బయటికి వచ్చిన తరువాత యహ్యా (రహ్మాలై)తో అన్నారు: "మహాశయా! ఈ విధమైన పొరపాటుకు బానిసను విడుదల చేయించవచ్చు, లేదా అరవై మంది నిరుపేదలకయినా అన్నదానం చేసి పరిహారం చెల్లించుకోవచ్చుగదా? మరి మీరు ఈ విధమయిన సలహా ఇచ్చి అమీర్ అబ్దుర్రహ్మాన్‌ని కష్టాల్లో పడవేశారేంటి? రెండు నెలలు ఎడతెగని ఉపవాసం ఉండటం అతని వల్ల అయ్యే పని కాదు."

సమాధానంగా హజ్రత్ యహ్యా (రహ్మాలై) ఇలా అన్నారు: "రెండవసారి అతను ఇలాంటి తప్పు చేయకుండా ఉండేందుకే నేనిలాంటి పద్ధతిని ప్రతిపాదించాను. అతని వద్ద సంపద ఉంది కాబట్టి బానిసను విడుదల చేయించడం అతనికి తేలికయిన పని. ఇంకా ధనబలంతో అతను అరవై మందేమిటి, వేల మందికయినా అన్నదానం చేయగలడు. ఒకవేళ నేను అమీర్‌కు ఈ రెండు సులువయిన పద్ధతులే తెలియజేసివుంటే అతను ఇదే విధంగా రోజాను సగంలో విరమించి బహు తేలికగా పరిహారం చెల్లించుకుంటాడు. ఎడతెగకుండా రెండు నెలలు రోజాను పాటిస్తేగాని అతనికి చెడు పనికి దొరికే ఫలితమేంటో తెలిసిరాదు."

ఇది విన్న ఆలిమ్‌లు వారితో ఏకీభవించడమేగాక, "మీరన్నదే నిజం, మీరు సరిఅయిన రీతిలో పరిహారం చెల్లించుకునే విధానాన్ని తెలిపారు" అని అన్నారు.

ఎంతటి వివేచనాపరులు, మంచివారు మన పెద్దలు. దైవం మనక్కూడా మన పెద్దల మార్గంలో నడిచే ఇలాంటి, శక్తిని, ఇంకా మనలో, "ప్రతి పని మనం దైవప్రసన్నత కోసమే చేయాలన్న" సద్బుద్ధిని ప్రసాదించుగాక!

# హజ్రత్ అబ్దుల్లా బిన్ తావుస్ (రహ్మాలై)

పూర్వం అబూ జాఫర్ మన్సూర్ అనే ప్రఖ్యాతి చెందిన ఓ గొప్ప ఖలీఫా ఉండేవాడు. అతను, ఎవరయినా తనకు అయిష్టమయిన విషయాన్ని తన ముందు ప్రస్తావిస్తే వారికి కఠిన శిక్ష వేసేవాడు. అయితే మహనీయులయిన మన పెద్దలు ఎంత గొప్ప చక్రవర్తుల ముందయినా, వారికి ఎంత చేదుగా ఉన్నా- జంకుగొంకూ లేకుండా- తాము చెప్పదలుచుకున్నది ఉన్నదున్నట్లు కుండబద్దలుకొట్టినట్లు చెప్పేవారు. అలాంటి మన పెద్దల్లో హజ్రత్ అబ్దుల్లా బిన్ తావుస్ (రహ్మాలై)కూడా ఒకరు. వీరి తండ్రి హజ్రత్ తావుస్ (రహ్మాలై) . ఓ గొప్ప హదీసు ఉల్లేఖనకర్త. హజ్రత్ అబ్దుల్లా (రహ్మాలై) హదీసు విద్యను తన తండ్రి వద్దనే నేర్చుకుని అనేక హదీసులను కంఠస్థం చేశారు.

ఒకసారి ఖలీఫా అబూ జాఫర్ మన్సూర్ ఆ కాలంలోని ప్రఖ్యాత ఆలిమ్‌లను పిలిచి సమావేశపరిచాడు. వారిలో హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మాలై), హజ్రత్ అబ్దుల్లా బిన్ తావుస్ (రహ్మాలై) లు కూడా ఉన్నారు. ఆ సమయంలో వీరిరువురూ నవ యువకులు. వీరు ఖలీఫా వద్దకు చేరి, కొంచెం సేపు కూర్చున్నారు. అలా కొంత సమయం గడిచాక ఖలీఫా మన్సూర్, హజ్రత్ అబ్దుల్లా (రహ్మాలై)తో, "మీరు మీ తండ్రి వద్ద నేర్చుకున్న ఏదయినా హదీసును విన్పించండ"ని అన్నాడు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ తావుస్ (రహ్మాలై)కు ఎన్నో హదీసులు జ్ఞాపకమున్నాయి. అయితే వారు విన్పించిన ఒక హదీసు విని ఖలీఫా చిరచిరలాడాడు. అదేంటంటే: "నాకు నా తండ్రి ఈ హదీసును ఇలా ఉల్లేఖించారు- ఎవరికయితే దైవం రాజరికాన్ని ప్రసాదించగా, అతను తన ప్రజలపై దౌర్జన్యం చేస్తాడో,

అతను ప్రళయ దినాన అందరికంటే ఎక్కువ శిక్ష ననుభవిస్తాడు."

ఈ హదీసు విన్న ఖలీఫా ముఖం కోపంతో మాడిపోయింది. దీన్ని గమనించిన ఇమామ్ మాలిక్ (రహ్మాలై) మనసులో, "ఖలీఫా అబ్దుల్లా (రహ్మాలై)ని తప్పక వధిస్తాడ"ని తలపోశారు.

కొద్ది సమయం తరువాత ఖలీఫా, హజ్రత్ అబ్దుల్లా బిన్ తావుస్ (రహ్మాలై)తో, "కొంచెం మీ కలం, సిరాను ఇలా ఇవ్వండి" అని అన్నాడు. ఖలీఫా మాటల్ని వినీవిననట్లు హజ్రత్ అబ్దుల్లా (రహ్మాలై) మౌనం వహించి కలంగాని, సిరాగాని అతని చేతికివ్వలేదు. ఖలీఫా మళ్ళీ అడిగాడు. అబ్దుల్లా (రహ్మాలై) మళ్ళీ అలాగే మౌనంగా ఉండిపోయారు. మూడవసారి మళ్ళీ అడిగినా వారు అలాగే ఉండిపోవడాన్ని చూసి ఖలీఫా కోపంతో, "మీరెందుకు నాకు కలం, సిరాను ఇవ్వటంలేదు" అని అడిగాడు.

హజ్రత్ అబ్దుల్లా (రహ్మాలై) సమాధానంగా అన్నారు: "మీరు ఆ సమయంలో కోపంగా ఉన్నారు. ఆ కోపంలో దైవానికయిష్టమయిన ఆదేశాన్ని జారీచేసి ప్రళయదినంనాడు ఎక్కడ పట్టుబడతారో అని నాకు భయం వేసింది. అదీగాక కలం, సిరా అందించినందుకు దైవం నేనంటే అయిష్టత చూపుతాడేమోనని కూడా నేను భయపడ్డాను."

ఇది విని ఖలీఫా, "మీరిద్దరూ ఇక్కణ్ణుంచి వెళ్ళిపోండ"ని ఆదేశించాడు. దీనిపై హజ్రత్ అబ్దుల్లా (రహ్మాలై), "మేము కూడా దీన్నే ఆశిస్తున్నాం" అంటూ ఇద్దరూ అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయారు.

హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మాలై) అంటుండేవారు, "తావుస్ తనయుడు ఎంతటి నిజమైన, పరిపూర్ణమైన ముస్లిమో, ఎంత గొప్పవాడో ఆ రోజుగాని నాకు తెలిసిరాలేదు."

చూశారా! మన పెద్దలు ఎంత గొప్పవాళ్ళో. వారు దైవానికి తప్ప మరెవ్వరికీ భయపడేవారు కారు. దైవం మనకూ అలాంటి మంచి పనులు చేసే సద్బుద్ధినే ప్రసాదించుగాక!

# ఇమామ్ సుఫియాన్ సూరి (రహ్మాలై)

షాఖా బిన్ హకీమ్ ఇలా అంటున్నారు: "ఒక రోజు నేను ఖలీఫా మెహ్దీ వద్ద కూర్చుని ఉన్నాను. అంతలో మెహ్దీ పిలుపు మేరకు హజ్రత్ సుఫియాన్ (రహ్మాలై) అక్కడికి వచ్చారు. ఆయన మామూలు ముస్లిములకు ఎలాగయితే సలామ్ చేస్తారో అలాగే మెహ్దీకు కూడా, "అస్సలాము అలైకుమ్" అని సలామ్ చేసి కూర్చున్నారు వారు.

సలామ్ చేసే సమయంలో వారు తన తలను గౌరవసూచకంగా వంచలేదు, చేతిని ఎత్తలేదు, ఇంకా కూర్చోవడానికి అనుమతీ తీసుకోలేదు. ఈ విషయం మెహ్దీ దర్బారు సంప్రదాయానికే విరుద్ధమయినది. అయితే దీనిపై మెహ్దీ చిరునవ్వు నవ్వుతూ, "ఓ సుఫియాన్! మీరు, మా భయం లేకుండా అటూ ఇటూ పరుగెత్తుతూ, మేము మీకెలాంటి హానీ తలపెట్టలేమని అనుకుంటున్నారు. కాని ఇప్పుడు మీరు మా అధీనంలో ఉన్నారు. మేము తలుచుకుని ఒక్క ఆజ్ఞ ఇస్తే చాలు, మా భటులు మిమ్మల్ని అగౌరవపరచి, అవమానంపాలు చేయగలరు తెలుసా?" అని అన్నాడు.

ఖలీఫా మెహ్దీ మాటలు విని హజ్రత్ సుఫియాన్ (రహ్మాలై), "ఒకవేళ మీరు నా పట్ల ఈ విధంగా ప్రవర్తించినట్లయితే- ఎవరి అధీనంలో అయితే సమస్త సృష్టి ఇమిడివుందో, మరెవరయితే సత్యాసత్యాలను వేరుచేసివేస్తాడో ఆ ప్రభువు రాజులకే రాజయిన అల్లాహ్- మీ పట్ల కూడా అలాగే వ్యవహరించడానికి నిర్ణయిస్తాడు" అని అన్నారు.

ఆ సమయంలో మెహ్‌దీ కుమారుడయిన రబీ మెహ్‌దీ వెనుక ఖడ్గాన్ని ఊతంగా చేసుకుని నిల్చుని ఉన్నాడు. అతను హజ్రత్ సుఫియాన్ (రహ్మాలై) సమాధానం విని పట్టరాని కోపంతో ఊగిపోతూ, "అమీరుల్ మోమినీన్! ఈ మూఢుడు మీ పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నాడు. ఇక అజ్ఞ ఇవ్వండి, ఇతని శిరస్సును ఇట్టే ఖండిస్తాను" అని అన్నాడు. కాని మెహ్‌దీ ముఖం చిట్లిస్తూ, "నీవు దౌర్భాగ్యుడివి, నీకు తెలియదు, ఇలాంటి వ్యక్తులు ఎలాంటి సద్గుణాలుకలిగివుంటారో. ఒకవేళ నీవు ఇతన్ని చంపేస్తే మనమంతా సర్వనాశనం అవుతాం. వీరి సత్యసంధత, నిజాయితీలను చూసి నేను వీరిని కూఫా పట్టణానికి ఖాజీ (న్యాయమూర్తి)గా నియమించదలిచాను. ఎటువంటి న్యాయమూర్తి అంటే వీరిచ్చే తీర్పుకు ఇక తిరుగే ఉండదు" అని అన్నాడు. ఆ తరువాత అనుకున్నట్లే ఖలీఫా మెహ్‌దీ వీరిని ఖాజీగా నియమించి కూఫాకు పంపాడు.

దారిలో హజ్రత్ సుఫియాన్ సూరి (రహ్మాలై) ఆ నియామక ఉత్తర్వుని నదిలో పారవేసి సిపాయీల కంటబడకుండా పరుగుతీసి వెళ్ళిపోయారు. ఖలీఫా వీరి కోసం అన్నివిధాలా గాలించాడు. కాని హజ్రత్ సుఫియాన్ సూరి (రహ్మాలై) చనిపోయేంతవరకూ అతనికి కన్పించలేదు.

# వాఖదీ (రహ్మాలై)

మన గౌరవనీయులైన పెద్దల్లో చాలా మంది తమ అసలు పేరుకన్నా తమ బిరుదుతోనే ప్రతీతి చెందారు. ఆ బిరుదు ఏదయినా కావచ్చు. అంటే ఓ ఘనకార్యంవల్లగాని, వంశం పేరుతోగాని, లేదా ప్రదేశం పేరుతోగాని వారి పేర్లు ప్రసిద్ధి చెందేవి. అలాగే మన పెద్దల్లో ఒకరు, "బుఖారీ షరీఫ్" అనే ఓ గొప్ప హదీసు గ్రంథాన్ని వ్రాశారు. వారు "బుఖారా" అనే ప్రదేశంలో నివసిస్తుండే

వారు కాబట్టి 'ఇమామ్ బుఖారీ' అని వారు ప్రసిద్ధి చెందారు. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) బుఖారీ షరీఫ్‌ను వ్రాసి ధార్మికంగా ఎంతో గొప్ప సేవ చేశారు.

ఆ విధంగానే జున్నూన్ మిస్రీ (రహ్మాలై) అనే మహనీయుడు కూడా ఈ కోవకే చెందినవారు. దైవవశాత్తు వీరు ఓసారి ఓ పెద్ద ఆపదలో చిక్కుకున్నారు. అప్పుడు దేవుడు చేపల ద్వారా వీరికి సహాయం చేశాడు. అరబీ బాషలో చేపని 'నూన్' అంటారు. అందువలననే ఈ మహనీయులు జున్నూన్‌గా అంటే చేపలవారుగా ప్రసిద్ధి చెందారు. ఇక మిస్రీ అని ఎందుకు పిలువబడే వారంటే వారు మిసర్ (ఈజిప్ట్) దేశంలోని ఒక గ్రామంలో జన్మించారు.

ఇదే విధంగా ఇంకా అనేక మంది మహనీయులున్నారు. అయితే వీరి పేర్లు కేవలం పెద్ద పెద్ద పండితులకే తెలుసు. మామూలు ప్రజానీకం వారి బిరుదుల వలననే వారిని ఎరుగుదురు. వీరంతా ధార్మికంగా ప్రజలకు ఎంతో విలువైన సేవల్ని అందించారు.

ఇప్పుడు ఇమామ్ వాఖదీ (రహ్మాలై)ని గురించి వినండి. వీరి తాత పేరు వాఖదీ. దీనితోనే జనం వీరిని వాఖదీ అని పిలిచేవారు. వాఖదీ (రహ్మాలై)- ప్రియప్రవక్త (సఅసం) హిజ్రత్ చేసిన 130 సంవత్సరాల తర్వాత మదీనాలో జన్మించారు. ఆ కాలంలో ప్రియప్రవక్త (సఅసం) అనుంగు అనుయాయుల (రజి)సంతానం, ఇంకా వారి శిష్యులు, వారిని చూసినవారు జీవించే ఉన్నారు.

ప్రియప్రవక్త (సఅసం)కు చెందిన విషయాల్ని తెలుసుకోవాలని హజ్రత్ వాఖదీ (రహ్మాలై)కు ఎంతో కోరికగా ఉండేది. వాఖదీ (రహ్మాలై) దీన్నే స్వచ్ఛమయిన సేవగా భావించి ఆ బాధ్యతను తీసుకున్నారు. దానికి తగినట్లుగానే ఆయన ప్రవక్త (సఅసం)కు చెందిన అనేక విషయాల్ని ఎంతో చక్కగా వ్రాశారు. ఈ విషయాల్ని జనం ఎంతో ఆసక్తితో చదివేవారు. హజ్రత్ వాఖదీ (రహ్మాలై) సహాబీల (రజి) సంతానం వద్దకు, సహాబీలను ఎరిగినవారి వద్దకు వెళ్ళి

ప్రియప్రవక్త (సఅసం) జీవిత విషయాల్ని అడిగి తెలుసుకుని, వాటిని వ్రాసుకునేవారు. ప్రవక్త (సఅసం)కు, బహు దైవారాధకులకు మధ్య జరిగిన ధర్మ యుద్ధాల గురించి వినాలంటే వాఖదీ (రహ్మలై)కి ఎంతో ఇష్టం. వాఖదీ (రహ్మలై) ఈ విషయాల్ని తెలుసుకుని ఎన్నో పుస్తకాల్ని వ్రాశారు. వారి ఇంటి నిండా ఇలాంటి పుస్తకాలే కుప్పలు కుప్పలుగా తయారయ్యాయి. ఈ పుస్తకాల ద్వారానే వాఖదీ (రహ్మలై) పేరు దూర దూర ప్రాంతాలకు ప్రాకి ప్రజలు వారిని ఎంతో గౌరవించసాగారు. ప్రజలే కాదు, ఆ కాలంలో రాజుగా ఉన్న మామూన్ రషీద్, అతని మంత్రి బరామకీ, ఇంకా అనేక మంది అధికారులు కూడా వారిని ఎంతో గౌరవించేవారు.

వాఖదీ (రహ్మలై)లో ఎన్నో మంచి లక్షణాలున్నాయి. వారు ఎంతో చక్కగా ఉపన్యసించేవారు. ఒక విషయాన్ని వింటే చాలు, వారు దాన్ని ఇక ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకునేవారు. ఇలాంటివే ఇంకెన్నో మంచి లక్షణాలతోపాటు వారిలో దాతృగుణం కూడా మెండుగా ఉంది. అంటే డబ్బుతో ఇతరులకు సహాయపడి సేవ చెయ్యడమన్న మాట. ఈ దాతృగుణం కారణంగానే వారెప్పుడూ ఖాళీ చేతులతో ఉండేవారు. వారి ఈ సుగుణానికి సంబంధించిన ఓ సంఘటన ఎంతో ప్రసిద్ధి చెందింది. దాన్ని గురించి స్వయంగా వారే ఇలా వ్రాసుకున్నారు:

"ఓసారి పండుగ వచ్చింది. ఆ సమయంలో పిల్లలకు బట్టలు కుట్టించడానిగ్గాను నా వద్ద ఏమీ లేకపోయింది. దీంతో పిల్లలు ఎంతో గొడవపెట్టగా ఏం చేయాలో నాకు పాలుపోలేదు. ఆ తరువాత ఓ ఉపాయం తట్టింది. నేను నా మిత్రుని వద్దకు వెళ్ళాను. అతను వ్యాపారి. అతని దగ్గర నా విషయాన్నంతా విన్నవించాను. ఆ సమయంలో అతని వద్ద ఒక లక్షా రెండు వందల రూపాయల డబ్బు సంచులున్నాయి. అతను ఆ మొత్తాన్నీ నాకు ఇచ్చివేశాడు. నేను వాటిని తీసుకుని ఇంటికి వచ్చాను. నేనా సంచులు

విప్పదీయనేలేదు, అంతలో హాష్మీ అనే నా మిత్రుడొకడు వచ్చాడు. అతనెంతో ఆందోళన చెందుతున్నట్లు కన్పించాడు. తనకెంతో అప్పుందని, గడువు ప్రకారం అప్పుల వాళ్ళంతా ఈ రోజు తన ఇంటికి వస్తారని, కాని తన వద్ద చిల్లిగవ్వ కూడా లేదని, అప్పు తిరిగి ఇవ్వకపోతే తనకెంతో పరాభవం జరుగుతుందని విన్నవించుకున్నాడు. అతని కలవరాన్ని చూసి నేను నా భార్యతో, 'ఉన్నదాంట్లో సగం డబ్బు అతనికిచ్చి తతిమ్మా డబ్బుతో మన అవసరాలు తీర్చుకుందామని' అన్నాను. ఇది విని నా సతీమణి, "బాగానే ఉంది, మీ మిత్రుడయిన ఆ వ్యాపారి పెద్దగా చదువురానివాడైనా మీకింత డబ్బు ఇచ్చాడు. మరి మీరింతటి పెద్ద ధర్మవేత్త అయివుండి కూడా మీ మిత్రునికి ఆ సొమ్ములో నుంచి సగం మాత్రమే ఇచ్చి పంపుతామంటున్నారు. ఇది ఏమంత బాగోలేదు" అని అన్నారు. నా సతీమణి మాట ప్రకారం ఆ తెచ్చిన డబ్బునంతా అతనికిచ్చి పంపాను.

ఇంకా వినండి- మరో ఆసక్తికరమయిన విషయం ఏం జరిగిందో. నేను ఏ వ్యాపారినుండయితే ఆ డబ్బు తెచ్చానో, అది అతని వద్దనున్న మొత్తం పైకం. ఆ తరువాత అతనిక్కూడా డబ్బు అవసరమై అప్పు కోసం బయలుదేరాడు. (నా రెండవ మిత్రుడు) హాష్మీగారు ఆ వ్యాపారికి కూడా మిత్రుడే. అతను హాష్మీ ఇంటికి వెళ్ళి, అతనికి తన విషయాన్ని తెలియజేసుకున్నాడు. ఇది విని హాష్మీ గారు ఆ డబ్బు సంచులన్నింటినీ అతనికిచ్చివేశారు. ఆ సంచుల్ని గుర్తించిన వ్యాపారి నిశ్చేష్టుడయిపోయాడు. వెంటనే పరుగెత్తుకుంటూ నా వద్దకు వచ్చాడు. వాటిని చూసి నేను జరిగిన వృత్తాంతాన్ని అతనికి తెలియజేశాను.

ఇక దీనిపై మేమంతా ఓ అంగీకారానికి వచ్చి-మా ముగ్గురికీ అవసరముంది కాబట్టి- ఆ డబ్బును సమానంగా పంచుకున్నాం. ఈ విషయం ఖలీఫా మామూన్ రషీద్‌కు, మంత్రి యహ్యా బరాముకీకు తెలిసింది. దాంతో అతను నన్ను పిలవనంపి విషయం వివరంగా తెలుసు కున్నాడు. మా ముగ్గురి

త్యాగం పట్ల ఖలీఫా ఎంతో సంతోషించాడు. తరువాత అతను నాకు పది వేల దీనార్‌లు (బంగారు నాణాలు) ఇస్తూ, "మీ ముగ్గురూ రెండు వేలు చొప్పున తీసుకుని తతిమ్మా నాలుగు వేల దీనార్‌లు మీ సతీమణికివ్వండి. ఎందుకంటే ఆవిడగారు, దాతృత్వంలో మీ ముగ్గురినీ మించిపోయారు" అని అన్నాడు.

వాఖదీ (రహ్మాలై) ఎంతటి ధర్మవేత్త అంటే, చిన్నా పెద్దా అందరూ వారిని ఎంతో గౌరవించేవారు. ఖలీఫా మామూన్ రషీద్ వారిని బగ్దాద్‌కు ఖాజీగా నియమించాడు. వారు తలచుకుంటే ఎంతో డబ్బు గడించేవారే. కాని వాఖదీ (రహ్మాలై) తన స్వహస్తాలతో కష్టపడి సంపాదించి ఇల్లు గడుపుకునేవారు. వారు గోధుమ వ్యాపారం చేసేవారు. కాని వారి చేతిలో డబ్బు నిలకడగా ఉండేది కాదు. అందువలననే వారు మరొకరితో కలసి భాగస్వామ్య వ్యాపారం చేసి అందులో వచ్చిన తన భాగంతో ఇల్లు గడుపుకునేవారు. తన చేతికి వచ్చిన డబ్బును వారెప్పుడూ కూడబెట్టక ఎక్కువగా దానధర్మాలు చేసేవారు. వారు పరమపదించినప్పుడు వారి ఖనన సంస్కారానికి సరిపడేంత డబ్బు కూడా వారింట్లో లేకుండింది. ఖలీఫా మామూన్ రషీద్‌కు ఈ విషయం తెలిసి వారి ఖననానికి తగినంత పైకం పంపాడు.

చూశారుగా- మన పెద్దలు ఎలాంటి దాతృగుణం, దైవభక్తి కలవారో. మనం కూడా ఇలాంటి సద్బుద్ధుల్ని అలవర్చుకుంటే వారిలానే మనమూ ప్రజలకు సేవ చేయగలం.

- : సమాప్తం : -